**రిపోర్టర్లు కావలెను...**

నిత్య నూతనంగా వెలుగుతూ సంచలన వార్తా కథనాలతో ముందుకు సాగుతున్న నేటి ప్రభాత సూర్య దిన పత్రిక లో పనిచేయుటకు తెలంగాణ లోని అన్ని జిల్లా కేంద్రాలలో, నియోజకవర్గాలలో మండల కేంద్రాలలో అంకిత భావంతో పనిచేసే రిపోర్టర్లు కావలెను ఆసక్తి కలిగిన వారు క్రింది ఉన్న నంబర్ కి సంప్రదించగలరు

సంప్రదించవలసిన వారు

9100900931, 9100900918

గమనిక :వాట్సాప్ లో బయోడేటా పంపగలరు



# నేటి ప్రభాత సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784.








ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 25 ఎడిటర్ : పోలగోని రాజేష్ పేజిలు : 8, వెల రూ. 4, /- గురువారం - 25 - జూన్ - 2025


# ఎమర్జెన్సీ చీకటి ఘట్టం... ఏ భారతీయుడూ మర్చిపోడు

- ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు
- 'సంవిధాన్ హత్యా దివస్'గా జరుపుకుంటున్నామన్న మోదీ
- నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శ



ఢిల్లీ: భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, ఆ రోజులను ఏ భారతీయుడూ మరిచిపోలేరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా మిగతా..2లో



## రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా?.. రేవంత్ కు హరీశ్ ప్రశ్న

- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చకు సిద్ధమంటూ హరీశ్ సవాల్
- కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలు సంస్కారహీనమన్న హరీశ్
- గెలుపుపై భరోసా లేకే రైతు భరోసా అంటున్నారని ఆరోపణ




# స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు

## గ్రామ పంచాయతీ ఎన్నికలకు డెడ్ లైన్

## సెప్టెంబర్ 30 వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం

## సమాయత్తం అవుతున్న అభ్యర్థులు...

నేటి ప్రభాత సూర్య- తెలంగాణ బ్యూరో: వాయిదా పడుతూ వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు డెడ్ లైన్ విధించింది. 30 రోజుల్లో వార్డుల విభజన ముగించి, సెప్టెంబర్ 30 వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైకోర్టు తీర్పుతో స్థానిక సంస్థల ఎన్నికలకు కదలిక వచ్చినట్లయింది. హైకోర్టు తీర్పును పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వాగతించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు మాజీ సర్పంచ్ లు దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ చేపట్టిన జస్టిస్ మాధవిదేవి తీర్పు వెలువరించారు. గ్రామ సర్పంచ్ ల పదవీకాలం ముగిసి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటికీ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వ జాప్యం చేస్తోందని పిటిషన్ల తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఏడాదిన్నరగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... మిగతా..2లో




# ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

మళ్లీ అణ్వాయుధ కార్యక్రమాలు చేపడితే తీవ్ర పరిణామాలు

ఇరాన్ యురేనియం శుద్ధిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక



అణ్వాయుధాల జోలికి వెళ్తే మళ్లీ దాడులు తప్పవని వెల్లడి

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ విరమణకు పుతిన్ సాయాన్ని తిరస్కరించిన ట్రంప్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని ట్రంప్ ప్రకటన



## కేసీఆర్ వల్లే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు: కవిత


- ఆరు గ్యారెంటీల అమలుపై అసెంబ్లీలో చర్చకు రావాలని రేవంత్ కు కవిత సవాల్
- మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపణ
- గోదావరి జలాలను చంద్రబాబుకు రేవంత్ గిఫ్ట్ గా ఇచ్చారని విమర్శ మిగతా..2లో

## మాకు ఇండియా ఫస్ట్...

# కొందరికి మోదీ ఫస్ట్

## శశిథరూర్ పై ఖర్గే ఫైర్

- మోదీని పొగిడిన శశిథరూర్‌పై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు
- ఆపరేషన్ సిందూర్‌పై థరూర్ ఆర్టికల్‌తో కాంగ్రెస్‌లో దుమారం
- థరూర్ వ్యాఖ్యలు వ్యక్తిగతమే, పార్టీవి కావన్న కాంగ్రెస్



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ నేత శశిథరూర్ ప్రశంసించడంపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. "మాకు దేశమే ప్రథమం, కానీ కొందరు వ్యక్తులకు మోదీయే ప్రథమం" అంటూ శశిథరూర్ ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశం చేపట్టిన దౌత్యపరమైన చర్యలపై 'ది హిందూ' పత్రికలో శశిథరూర్ రాసిన వ్యాసం చుట్టూ జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాసంలో, ప్రధానమంత్రి మోదీ శక్తి, చైతన్యం, ప్రపంచ వేదికపై నిమగ్నమవ్వాలనే ఆయన తపన భారతదేశానికి మిగతా..2లో

## భారత్‌తో చర్చలకు సిద్ధం

# పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో టెలిఫోన్ సంభాషణ

వివిధ అంశాలపై చర్చించడానికి పాక్ సుముఖంగా ఉందన్న షరీఫ్

ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పాకిస్థాన్‌తో చర్చలు ఉండవన్న భారత్

## ఇకపై ప్రతిరోజూ ప్రజలు, కార్యకర్తలతో

# మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం



- జులై 2 నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కేడర్‌కు లోకేశ్ పిలుపు
- తల్లికి వందనం, మెగా డీఎస్సీ వంటి హామీల అమలు ప్రస్తావన
- అహంకారం వీడి, ఓర్పు సహనంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచన
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ఏర్పాటు అన్న మంత్రి

మచిలీపట్నం: రెడ్‌బుక్ పేరు వింటే వైకాపా నేతలకు గుండెపోటు వస్తోందని మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం విచ్చేసిన లోకేశ్‌కు మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, తెదేపా శ్రేణులు ఘనస్వాగతం పలికారు. తెలుగు మహిళలు హారతి ఇచ్చారు. తల్లికి వందనం అమలు చేసినందుకు సంతోషంగా ఉందని మహిళలు ధన్యవాదాలు తెలిపారు. పిల్లలను మిగతా..2లో

# రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

- ★ ఒకప్పుడు దావోస్ వెళతామంటే... వద్దని సలహా ఇచ్చేవారు: చంద్రబాబు
- ★ విజయవాడలో ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశం
- ★ ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- ★ గతంలో పారిశ్రామికవేత్తలతో మాట్లాడటానికి నేతలు వెనుకాడేవారన్న సీఎం
- ★ పీవీ నరసింహారావు ప్రపంచీకరణ నిర్ణయంతో దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని వ్యాఖ్య




అమరావి: రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తోందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ప్రశంసించింది. విజయవాడలో ఈరోజు జరిగిన ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా మిగతా..2లో



## పవన్ పై కించపరిచే పోస్టులు...

# ముగ్గురు అరెస్ట్

- పవన్ ఫొటోలను మార్ఫింగ్ చేసిన ముగ్గురు వ్యక్తులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన జనసేన నాయకులు
- నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్న పోలీసులు

## ముగ్గురు ఇజ్రాయెలీ గూఢచారులను ఉరితీసిన ఇరాన్..

# 700 మంది అరెస్ట్



మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై ముగ్గురిని ఉరితీసిన ఇరాన్

అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం

ఆ మరుసటి రోజే ఇరాన్‌లో ఈ అరెస్టులు, ఉరిశిక్షల అమలు

## స్వర్ణాంధ్ర విజన్ 2047కు సంపూర్ణ మద్దతు: ఫిక్కీ

స్వర్ణాంధ్ర విజన్- 2047ను సాకారం చేసేందుకు తమ వైపు నుంచి పూర్తి మద్దతు ఉంటుందని ఫిక్కీ జాతీయ కార్యవర్గం వెల్లడించింది. విజయవాడలో నిర్వహించిన ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. వివిధ కంపెనీల యాజమాన్యాలు, ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వ చేపడుతున్న చర్యలు, పాలసీలు ఇండస్ట్రీ ఫ్రెండ్లీగా ఉంటున్నాయని ఫిక్కీ ప్రతినిధులు తెలిపారు. ఎంఎస్ఎంఈల విషయంలో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు ఫిక్కీ అభినందనలు తెలిపింది.



## హైదరాబాద్‌లో బోనాలు.. నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

హైదరాబాద్: జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2,783 ఆలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణ కోసం నిధులను చెక్కుల రూపంలో జారీ చేసిందన్నారు. ఆషాఢ మాసంలో ముందుగా నగరంలోని గోల్కొండ బోనాలు జూన్ 29న జులై 1, 2 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జులై 13, 14 తేదీల్లో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం బోనాలు, జులై 20న లాల్ దర్వాజా బోనాలు.. జులై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి బోనాలు, మిగిలిన దేవాలయాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.

# ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



అమెరికా : ఇరాన్ తన యురేనియం శుద్ధి కార్యక్రమాలను తక్షణమే నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. టెహ్రాన్ మరోసారి అణ్వాయుధ కార్యక్రమాల దిశగా అడుగులు వేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని, దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ ముఠాల ఆర్థిక వనరులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులను ముమ్మరం చేసిన ప్రస్తుత తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇటీవల ఇజ్రాయెల్ వాయుసేన దక్షిణ లెబనాన్‌లో జరిపిన దాడిలో అల్ సాదిక్ కరెన్సీ ఎక్స్ఛేంజి అధిపతి అబ్దుల్లా బక్రి హతమయ్యారు. ఇరాన్‌కు చెందిన ఖుద్స్ ఫోర్స్ నుంచి హెజ్‌బొల్లాకు నిధులు మళ్లించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు ఇరాన్‌పై మరింత ఒత్తిడిని పెంచేవిగా ఉన్నాయి. మరోవైపు, డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో చేసిన ఒక పోస్ట్ కూడా చర్చనీయాంశమైంది. "ఇరాన్, ఇజ్రాయెల్ రెండు దేశాలు కూడా యుద్ధం ఆగాలని సమానంగా కోరుకున్నాయి. ఇరాన్ అణుకేంద్రాలు, అణు సామర్థ్యాలను ధ్వంసం చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఆ తర్వాతే యుద్ధాన్ని ఆపాను" అని ట్రంప్ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

పుతిన్ సాయాన్ని తిరస్కరించా: ట్రంప్

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కాల్పుల విరమణకు తాను మధ్యవర్తిత్వం వహించి సాయం చేస్తానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించినట్లు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అయితే, ఆ ప్రతిపాదనను తాను సున్నితంగా తిరస్కరించినట్లు తెలిపారు. నెదర్లాండ్స్‌లో త్వరలో ప్రారంభం కానున్న నాటో సదస్సుకు వెళుతున్న సందర్భంగా 'ఎయిర్‌ఫోర్స్ వన్' విమానంలో ఆయన జర్నలిస్టులతో ఈ విషయాలను పంచుకున్నారు. "రష్యాతో ఒక ఒప్పందం కుదుర్చుకోవాలని నేను భావిస్తున్నాను. ఇటీవల పుతిన్ నాకు ఫోన్ చేసి 'ఇరాన్ యుద్ధం విషయంలో మీకు ఏమైనా సాయం చేయమంటారా?' అని అడిగారు. ఇరాన్ విషయంలో నాకు మీ సహాయం అవసరం లేదని స్పష్టంగా చెప్పాను. మీ (రష్యా) విషయంలోనే నాకు సహాయం కావాలి" అని పుతిన్‌తో అన్నట్లు ట్రంప్ వివరించారు. నాటో సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యే అవకాశాలున్నాయని కూడా ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం జెలెన్‌స్కీ ఎన్నడూ లేనంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు పలికి, ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు కృషి చేస్తానని ట్రంప్ ప్రకటించారు. గత వారంలోనే ఈ యుద్ధంలో సుమారు ఆరు వేల మంది సైనికులు మరణించినట్లు ఆయన పేర్కొన్నారు.

## భారత్‌తో చర్చలకు సిద్ధం
## పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

ఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేంత వరకు పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలు జరిపేది లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం చర్చల అంశాన్ని పదేపదే లేవనెత్తుతోంది. ఇరు దేశాల మధ్య పరిష్కారం కాని వివాదాలపై అర్థవంతమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మరోసారి ప్రకటించారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్)తో ఇటీవల జరిపిన టెలిఫోన్ సంభాషణలో షరీఫ్ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు రేడియో పాకిస్థాన్ తెలిపింది. జమ్మూకశ్మీర్ సమస్య, ఉగ్రవాదం, వాణిజ్య సంబంధాలు, జలాల పంపిణీ వంటి కీలక అంశాలపై చర్చించడానికి పాకిస్థాన్ సుముఖంగా ఉందని ఆయన పేర్కొన్నట్లు తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై సౌదీ యువరాజు ఎంబీఎస్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఫోన్‌లో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను షరీఫ్ ప్రస్తావించారని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు సమాచారం. గతంలో పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన అనంతరం, భారత సైన్యం పాకిస్థాన్‌పై సైనిక చర్య చేపట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు కూడగట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా సౌదీ అరేబియా, ఇరాన్, అజర్‌బైజాన్ వంటి దేశాలను సంప్రదించింది. పాకిస్థాన్‌తో చర్చల అంశంపై స్పందించిన భారత్, సరిహద్దు ఆవలి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయే వరకు ఎలాంటి చర్చలు ఉండవని తేల్చి చెప్పింది. ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో కొనసాగడం అసాధ్యమని, నీరు, రక్తం కలిసి ప్రవహించలేవనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలని భారత్ గట్టిగా హెచ్చరించింది.

## ముగ్గురు ఇజ్రాయెలీ గూఢచారులను ఉరితీసిన ఇరాన్..
# 700 మంది అరెస్ట్

ఇజ్రాయెల్ : ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులకు ఇరాన్ బుధవారం మరణశిక్ష అమలు చేసింది. ఆ దేశంతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై సుమారు 700 మందిని అరెస్టు చేసినట్లు ప్రభుత్వ అనుబంధ నూర్‌న్యూస్ వెల్లడించింది. ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ న్యూస్ ఏజెన్సీ ముగ్గురి ఉరిశిక్ష విషయాన్ని ధ్రువీకరించింది. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. 12 రోజుల పాటు ఇరు దేశాల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలు చెలరేగిన అనంతరం, అమెరికా జోక్యంతో ఇరు పక్షాలు శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. అయితే, ఈ ఒప్పందం జరిగి 24 గంటలు కూడా గడవకముందే మొసాద్ కోసం గూఢచర్యం చేశారన్న అభియోగాలపై ముగ్గురికి మరణశిక్ష విధించడం, యూదు దేశంతో సంబంధాలున్నాయనే నెపంతో వందల సంఖ్యలో ప్రజలను అరెస్టు చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదనడానికి ఈ ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## కేసీఆర్ వల్లే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు: కవిత



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు తీరు, మహిళలకు చేసిన వాగ్దానాలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. ఇదే సమయంలో, పెన్షన్ల పెంపుదల వంటి హామీలను నెరవేర్చాలని కోరుతూ ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీకి పోస్టుకార్డులు పంపే ఉద్యమానికి ఆమె శ్రీకారం చుట్టారు. గోదావరి జలాల అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసరడంపై కవిత స్పందిస్తూ... "యస్.. అసెంబ్లీలో కచ్చితంగా చర్చిద్దాం. అయితే, ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసిన అంశాలపై కూడా చర్చ జరగాలి" అని డిమాండ్ చేశారు. కేసీఆర్ దమ్ము ఏమిటో అసలైన కాంగ్రెస్ పార్టీకి తెలుసు కాబట్టే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ వచ్చింది కాబట్టే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగలిగారని ఆమె అన్నారు. ఈ విషయాన్ని విస్మరించి రేవంత్ రెడ్డి మాట్లాడటం బాధాకరమని, ఆయన మరింత హుందాగా వ్యవహరించాలని సూచించారు. చంద్రబాబును రేవంత్ పిలిచి హైదరాబాద్ బిర్యానీ తినిపించి, గోదావరి నీళ్లను కానుకగా ఇచ్చారని కవిత ఆరోపించారు. రేవంత్ రెడ్డికి అబద్ధాలు చెప్పడం పరిపాటిగా మారిందని, 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదని ఆమె వ్యాఖ్యానించారు. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం తలపెట్టరని కవిత స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరని ఆమె హెచ్చరించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ సంతకంతో కూడిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారని కవిత గుర్తు చేశారు. సోనియా గాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆమె ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీల ప్రకారం పెన్షన్ల మొత్తాన్ని పెంచేలా సీఎం రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వేలాది పోస్టుకార్డులను సోనియా గాంధీకి పంపుతున్నామని తెలిపారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ.2 వేల పెన్షన్ ను రూ.4 వేలకు పెంచుతామన్న హామీని విస్మరించారు. వికలాంగుల పెన్షన్ ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచకుండా మోసం చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీ ఏమైంది?" అని కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ హామీలన్నింటినీ తక్షణమే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ పోస్టుకార్డుల ఉద్యమం ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తామని కవిత పేర్కొన్నారు.

## పవన్ పై కించపరిచే పోస్టులు...
# ముగ్గురు అరెస్ట్

అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కించపరుస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసిన ముగ్గురు వ్యక్తులను కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని పిఠాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పవన్ పాల్గొన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి, అభ్యంతరకరంగా సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారని ఆయన వివరించారు. ఈ ఘటనపై జనసేన నాయకులు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అరెస్టయిన వారిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానానికి చెందిన కర్రి వెంకట సాయి వర్మ, మచిలీపట్నం మండలం వలందపాలెం గ్రామానికి చెందిన పాముల రామాంజనేయులు, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ సింగరేణి కాలనీకి చెందిన షేక్ మహబూబ్ ఉన్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఎమర్జెన్సీ చీకటి ఘట్టం... ఏ భారతీయుడూ మర్చిపోడు

మొదటి పేజి తరువాయి



ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా పరిగణిస్తున్నామని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి పాలకులు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను పూర్తిగా పక్కనపెట్టారని ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులను కాలరాశారని, పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, చివరికి సామాన్య పౌరులను కూడా అన్యాయంగా జైళ్లలో నిర్బంధించారని ఆరోపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నే అరెస్టు చేసినట్లుగా అనిపించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ నాటి భయానక పరిస్థితులను ఏ భారతీయుడూ అంత తేలికగా మరచిపోలేరని ప్రధాని పునరుద్ఘాటించారు. ఆ దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాటం చేశారని గుర్తుచేశారు. వారి అలుపెరగని పోరాటం వల్లే చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మరింత బలోపేతం చేస్తామని, వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మోదీ తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కలలను సాకారం చేయడమే తమ ధ్యేయమని అన్నారు. ఈ సందర్భంగా, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో తాను ఒక పుస్తకాన్ని తీసుకురాబోతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా తన ప్రస్థానం, ఎమర్జెన్సీ రోజుల్లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, తన అనుభవాలను ఆ పుస్తకంలో వివరంగా పొందుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పుస్తకం ద్వారా నాటి చీకటి రోజులకు సంబంధించిన అనేక తెలియని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

## రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా?.. రేవంత్ కు హరీశ్ ప్రశ్న



హైదరాబాద్: రైతు భరోసా కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధమని, తెలంగాణకు జరుగుతున్న ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపిస్తానని 'ఎక్స్' వేదికగా సవాల్ విసిరారు. ప్రభుత్వ కార్యక్రమంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంస్కారం లేని విధంగా మాట్లాడి తన చిల్లర బుద్ధిని మరోసారి ప్రదర్శించారని హరీశ్‌రావు విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలోని అద్భుత ప్రగతిని తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై భరోసా లేకనే విధిలేని పరిస్థితుల్లో రైతుభరోసా వేస్తున్నారని, లక్ష కోట్లు కూడా ఖర్చుకాని కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందనడం ప్రపంచం నవ్విపోతోందని పేర్కొన్నారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయలేని దద్దమ్మ ఇప్పుడు అన్నారం, సుందిళ్ల కూడా కూలాయని అంటున్నారని, అది నోరా మోరా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. దమ్ముంటే, ఇసుమంతైనా నిజాయితీ ఉంటే 30 లక్షల మంది కౌలు రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇచ్చి మాట్లాడాలని, సన్న వడ్లకు రూ.1,200 కోట్ల బోనస్ బకాయిలు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. హామీలపై ప్రశ్నిస్తున్నందుకే తమపై బూతులతో చెలరేగుతున్నారని, అయినా తాము సంయమనం కోల్పోబోమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు అబద్ధాల పుట్టను బద్దలు కొడుతూనే ఉంటామని హెచ్చరించారు. "గెలిచిన వాడు రాజు, ఓడిపోయిన వాడు రావణాసురుడు" అని సీఎం అంటున్నారని, మరి రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా అని నిలదీశారు.

## మాకు ఇండియా ఫస్ట్... కొందరికి మోదీ ఫస్ట్

మొదటి పేజి తరువాయి



ప్రధానమంత్రి మోదీ శక్తి, చైతన్యం, ప్రపంచ వేదికపై నిమగ్నమవ్వాలనే ఆయన తపన భారతదేశానికి "ప్రధాన ఆస్తి"గా నిలుస్తోందని, అయితే దీనికి మరింత మద్దతు అవసరమని థరూర్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇబ్బందికి గురిచేయడమే కాకుండా... పార్టీ హైకమాండ్ కు, థరూర్‌కు మధ్య దూరాన్ని మరింత పెంచాయి. పార్టీ లైన్‌కు అనుగుణంగా థరూర్ మాట్లాడకపోవడంపై హైకమాండ్ అసంతృప్తితో ఉంది. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, "శశిథరూర్ ఇంగ్లిష్ చాలా ధారాళంగా మాట్లాడతారు. నాకు ఇంగ్లిష్ అంత బాగా రాదు. ఆయన భాష చాలా బాగుంటుంది. అందుకే ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించాం" అని అన్నారు. 26 మంది అమాయకులు మరణించిన పహల్గామ్ దాడి తర్వాత, ప్రతిపక్షాలన్నీ సైన్యానికి అండగా నిలుస్తాయని చెప్పాయని ఖర్గే గుర్తుచేశారు. "దేశం ముందు, పార్టీ తర్వాత అన్నాం. కానీ కొందరు వ్యక్తులు 'మోదీ ముందు, దేశం తర్వాత' అని భావిస్తున్నారు. మేమేం చేయగలం?" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ఓ కార్యక్రమంలో థరూర్ మాట్లాడుతూ, తాను రాసిన వ్యాసాన్ని తాను బీజేపీలో చేరడానికి చేస్తున్న ప్రయత్నంగా చూడరాదని, అది జాతీయ ఐక్యత, దేశ ప్రయోజనాలు, భారతదేశానికి అండగా నిలవడమనే ఉద్దేశంతో చేసిందని స్పష్టం చేశారు.

# రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిక్కీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. సమావేశంలో ఫిక్కీ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు, తీసుకుంటున్న చర్యలు పరిశ్రమల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని కొనియాడారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) విషయంలో చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం చూపుతున్న చొరవను వారు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న "స్వర్ణాంధ్ర విజన్ 2047" లక్ష్యాలను సాకారం చేసేందుకు తమవంతు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఫిక్కీ జాతీయ కార్యవర్గం ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, గతంలో నాటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రపంచీకరణకు (గ్లోబలైజేషన్) పచ్చజెండా ఊపడం వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందని తెలిపారు. పీవీ నరసింహారావు ఆ నిర్ణయం కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నారని కొందరు చెబుతున్నప్పటికీ, ఆ చర్య దేశానికి ఎంతో మేలు చేసిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, మనం ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్ వంటి ఆధునిక సాంకేతికతల గురించి మాట్లాడుకుంటున్నామని ఆయన అన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఫిక్కీ వంటి సంస్థలు దేశ పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పారిశ్రామికవేత్తలతో మాట్లాడి రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు అనేకసార్లు దావోస్ వంటి ప్రపంచ ఆర్థిక సదస్సులకు హాజరయ్యానని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. "ఒకప్పుడు వ్యాపారవేత్తలతో రాజకీయ నాయకులు పెద్దగా మాట్లాడేవారు కాదు. దావోస్ వెళ్తామంటే, ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని వద్దని సలహా ఇచ్చేవారు. అయినా నేను వెళ్లాను, పారిశ్రామికవేత్తలతో చర్చించి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ప్రయత్నించాను" అని ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పారిశ్రామిక ప్రగతి కీలకమని, ఆ దిశగా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతకు చిరునామాగా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వందేళ్ల తర్వాత కూడా టెక్నాలజీలో ఎవరూ అందుకోలేని భవిష్యత్తు నగరంగా రాజధాని ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. విజయవాడలో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ కార్యనిర్వాహక సమావేశంలో చంద్రబాబు ప్రసంగించారు. దేశ పురోగతిలో ఐటీ కీలక పోషిస్తోందన్నారు. టెక్నాలజీని ముందుకు తీసుకెళ్లడంలో ఐటీ అభివృద్ధి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రకాల డ్రోన్స్ మానవాళికి అనేక రకాలైన సేవలు అందుబాటులోకి తెస్తాయని వెల్లడించారు. సాంకేతకత జీవితంలో ఒక భాగంగా మారుతుందని చెప్పారు. డ్రోన్ల సాయంతో రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారన్నారు. ఏఐ, నాలెడ్జితో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో అమరావతిలో మంచి అవకాశాలు రానున్నాయని తెలిపారు. హైదరాబాద్ ఏవిధంగా అభివృద్ధి జరిగిందో ఇంకా కొత్త తరహాలో అమరావతిని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు.




మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. రిజర్వేషన్లు ఖరారు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామని, దీనికి రెండు నెలల సమయం పడుతుందని ధర్మాసనానికి ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ తెలిపారు. ఈ అభ్యర్థలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ధర్మాసనం... సెప్టెంబర్ 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తీర్పు వెలువరించింది. గతేడాది జనవరిలో గ్రామ పంచాయతీల పాలక వర్గం గడువు ముగిసింది. దాదాపు 17 నెలలుగా పాలక వర్గాలు లేకుండా ప్రత్యేక అధికారుల పాలనలోనే గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి. దీంతో గ్రామ స్థాయిలో అభివృద్ధి కుంటుపడింది. కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొన్న విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం పేర్కొంది. దీనికి అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించి అసెంబ్లీలో తీర్మానం పాస్ చేయించి కేంద్రానికి పంపింది. రాష్ట్ర వ్యాప్తంగా 12వేల751 గ్రామ పంచాయతీలు.. 5వేల 817ఎంపీటీసీలు, 538 జెడ్పీటీసీలు, 32 జిల్లా పరిషత్ లు ఉన్నాయి. గ్రామ పంచాయతీల పాలకమండలి గత ఏడాది జనవరి 20న ముగియగా, సర్పంచ్ ల స్థానంలో ప్రత్యేక అధికారులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. అలాగే గత ఏడాది జూలై 4న 32 జిల్లా పరిషత్‌లు, 538 మండల పరిషత్ పాలక మండళ్ల పదవీ కాలం ముగిసింది. వీటితో పాటు మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేస్తూ వస్తోంది. మంత్రివర్గ విస్తరణ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందని లీకులు వచ్చినా అది జరగలేదు. బీసీ రిజర్వేషన్ల పెంపు జాప్యమే దీనికి కారణంగా తెలుస్తోంది. హైకోర్టు తీర్పుతో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దన్న సుప్రీంకోర్టు నిబంధనతో మల్లగుల్లాలు మొదలయ్యాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్ రాకపోతే పార్టీ పరంగా రిజర్వేషన్లు చేయనున్నారు. 42 శాతం మంది బీసీలకు టికెట్లు ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మీనాక్షి నటరాజన్ తో పాటు అధిష్టానంతో పలు దఫాలుగా చర్చలు కూడా జరిగాయి. రెండు, మూడు రోజుల్లో రిజర్వేషన్లపై విధానం ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీసీ రిజర్వేషన్లు ఖరారు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఇకపై ప్రతిరోజూ ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం

తల్లికి వందనం అమలు చేసినందుకు సంతోషంగా ఉందని మహిళలు ధన్యవాదాలు తెలిపారు. పిల్లలను చదివించేందుకు ఏ తల్లీ ఇబ్బంది పడకూడదనే తల్లికి వందనం అమలు చేశామని లోకేశ్ తెలిపారు. వైకాపా నేతలు మహిళలను కించపరిచేలా ఎలా మాట్లాడారో చూశామన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలను గౌరవించే పరిస్థితి ఉంటుందన్నారు. త్వరలో పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పెడతామన్నారు. సమాజంలో మార్పు రావాలి, మహిళలతో మాట్లాడే విధానం మారాలన్నారు. చట్టాలు, డబ్బులతో ఆ మార్పు రాదన్నారు. బ్రాహ్మణి సహకారం లేకపోతే తాను ఏం చేయలేనని అన్నారు. తన తల్లి త్యాగం చేయకపోతే చంద్రబాబు రాష్ట్రానికి సేవ చేయలేరని అన్నారు. మహిళలకు గౌరవం పెరిగేలా ఈ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని లోకేశ్ స్పష్టంచేశారు.

ఇకపై ప్రతిరోజూ ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం: మంత్రి లోకేశ్

రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వ విజయాలను జులై 2వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ చేరవేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఏ ఒక్క కార్యకర్తను విస్మరించేది లేదని, వారి సేవలను తప్పనిసరిగా గుర్తిస్తామని ఈ సందర్భంగా లోకేశ్ హామీ ఇచ్చారు. ఇకపై పార్టీ అధినేత చంద్రబాబు, తాను ప్రతిరోజూ ఐదుగురు ప్రజలు, ఐదుగురు కార్యకర్తలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ అంతర్గత సమస్యలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని లోకేశ్ వెల్లడించారు. "కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. పార్టీ సంస్థాగత విషయాలు, సమస్యలపై చంద్రబాబుతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాను. పది నిర్ణయాల్లో ఒక తప్పు జరిగే అవకాశం




ఉంటుంది. అలాంటి పొరపాట్లు జరిగినప్పుడు వివిధ స్థాయిల్లోని నాయకుల ద్వారా మా దృష్టికి తీసుకువస్తే వాటిని సరిదిద్దుకుంటాం" అని ఆయన అన్నారు. గత ఎన్నికలకు ముందు నిర్వహించిన బాబు సూపర్%-%6, బాబు ష్యూరిటీ%-%భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాలతో పాటు ఎన్నికల అనంతరం చేపట్టిన మన టీడీపీ, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని ప్రశంసించారు. పార్టీ కార్యకలాపాలను డిజిటల్ విధానంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి పనిచేసిన వారిని గుర్తించాలన్నదే తమ పార్టీ విధానమని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక కూడా కేడర్‌ను మరువకుండా చంద్రబాబు, తాను ప్రతి జిల్లాకు వెళ్లినప్పుడల్లా కార్యకర్తలను కలుస్తున్నామని గుర్తుచేశారు.

జులై 2 నుంచి గడవగడవకు వెళ్లండి

జులై 2వ తేదీ నుంచి ప్రతిఒక్కరూ గడపగడపకు వెళ్లి, గత ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. "బాబు సూపర్ - 6 కార్యక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఒకే జీఓతో రూ.8,745 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశాం. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ నిర్దేశిత సమయానికే తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలుచేశాం" అని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని, పెద్దఎత్తున పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు శాయశక్తులా కృషిచేస్తున్నామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా వృద్ధులకు రూ.4,000 పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయబోతున్నామని లోకేశ్ ప్రకటించారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు మృతి..?



షాద్ నగర్-నేటిప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్, (జూన్25) : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరివేసుకొని మృతి చెందిన ఘటన కేశంపేట మండలం లే మామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కల పల్లి గ్రామంలో దిద్దెల పెద్దయ్య ,పెద్ద కుమారుడు దిద్దెల ప్రశాంత్ (30) భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో భార్య భర్త తరచుగా గొడవ పడేవారని భార్య కృష్ణవేణి తల్లి గారి గ్రామం సింగంపల్లి లో ఉన్నాదని భార్యను ఈనెల23 తారీకు న తీసుకురావడానికి వెళ్లగా రానందున 24వ తేదీ గ్రామానికి వచ్చి రాత్రి వేళలో ఇంట్లో ఉరివేసుకొని చనిపోయాడని తండ్రి దిద్దెల పెద్దయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేశంపేట పోలీస్ సిఐ నరహరి తెలిపారు.

## బీఎస్పీ షాద్ నగర్ అసెంబ్లీ కార్యదర్శిగా కొండేటి మహేందర్




షాద్ నగర్, నేటి ప్రభాత సూర్య ,జోన్ ఇంచార్జ్ (జూన్ 25):షాద్ నగర్ నియోజకవర్గ బిఎస్పీ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి. అసెంబ్లీ అధ్యక్షులు సొంటె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ దొడ్డి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండేటి నర్సింలు హాజరయ్యారు, ఈ సమావేశంలో షాద్ నగర్ అసెంబ్లీ కార్యదర్శిగా కమ్మదనం గ్రామానికి చెందిన కొండేటి మహేందర్ ను ఏకగ్రీవంగా నియమించి, జిల్లా నాయకుల సమక్షంలో నియోజకవర్గ అధ్యక్షులు సొంటె శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ నియమ నిబంధనలను అనుసరిస్తూ ప్రోటోకాల్ ను పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నూతనంగా అసెంబ్లీ కార్యదర్శిగా నియమితులైన కొండేటి మహేందర్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పజెప్పిన పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి తుప్పరి కుమార్, ఫరూక్ నగర్ మండల అధ్యక్షులు శివగల ఆంజనేయులు, నాయకులు కొండేటి శరత్ చమార్, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు ఎంపీ ఆర్ కృష్ణన్నను ను కలిసిన బీసీ సేన నాయకులు



షాద్ నగర్, నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (జూన్ 25) : జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ను హైదరాబాదులోని తన నివాసంలో కలిసి శాలువలతో సన్మానించారు. అనంతరం బీసీల హక్కుల సాధన కొరకు బీసీ సేన గ్రామస్థాయి కమిటీలు కార్యాచరణ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, బీసీ సేన నాయకులు నేరెట్ల మహేందర్ గౌడ్, షాబాద్ మండల అధ్యక్షులు దయాకర్ చారి, ఉపాధ్యక్షులు మీరంపల్లి బాలరాజ్, గడ్డమీద వెంకటయ్య ,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ,కడుమూరు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎలిమినేడు లో రైతుబంధు సంబరాలు



ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్(జూన్ 25)కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో బుధవారం రైతు సంబరాలు నిర్వహించారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇబ్రహీంపట్నంనియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డిరంగారెడ్డి ఆదేశాల మేరకు ఎలిమినేడు గ్రామంలో రైతన్నలతో పాలాభిషేకం నిర్వహించి, రైతు సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, మంచిరెడ్డి వెంకట్ రెడ్డి, గట్టు జంగయ్య, పొగాకు స్వామి, గట్టు భాష, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్, శ్రీశైలం, గజ్జల శివశంకర్, ఆర్కసురేష్, గణేష్,జలంధర్, మహేందర్,హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు దుర్మరణం



చింతపల్లి, నేటి ప్రభాత సూర్య (జూన్ 25)అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని నడిపిన ఓ యువకుడు చెట్టుకు అతిబలంగా ఢీకొని తలకు తీవ్ర గాయాలై మృతి చెందిన సంఘటన చింతపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ మండలం ఎల్లారెడ్డి బాయి గ్రామానికి చెందిన శిఖిలంమెట్ల అభిలాష్ తండ్రి శ్రీను 23 మంగళవారం 24 అర్ధరాత్రి దాటిన తర్వాత తన సొంత గ్రామం ఎల్లారెడ్డిబావి నుండి హైదరాబాద్కు తన బజాజ్ పల్సర్-160 నెం. టిజి 07జి 2254 పై వెళుతుండగా, చింతపల్లి మండలం అనజ్పూర్ రోడ్డు సమీపంలోకి చేరుకోగానే బైక్పై నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టడం జరిగింది. తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యి అక్కడికక్కడే మరణించడం జరిగింది. సమాచారం అందిన వెంటనే ఇన్స్పెక్టర్ రాజు, సబ్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామ్మూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి మృతదేహానికి పంచనామ నిర్వహించి దేవరకొండ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సమయంలో మృతుడు హెల్మెట్ ధరించకుండా మద్యంమత్తులో అతివేగంగా మూలమలుపు వద్ద అదుపుతప్పి చెట్టు ఢీకొని ఉంటాడని అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## యాచారంలో ఫర్టిలైజర్స్ దుకాణాలను అకస్మాత్తుగా తనిఖీ మండల వ్యవసాయ అధికారి రవినాథ్



యాచారం సూర్య న్యూస్ (జూన్ 25):. యాచారం మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఏజెన్సీస్ , ఫర్టిలైజర్స్ దుకాణంలో అకస్మాత్తుగా మండల వ్యవసాయ అధికారి రవినాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ పద్మావతి, టాస్క్ సిఐ ముర్దాస్ అలీ తనిఖీ నిర్వహించారు.

బుధవారం ఈ కార్యక్రమంలో భాగంగా.. దుకాణాల్లో ఉన్న ఎరువులు విత్తనాల స్టాకును వ్యవసాయ అధికారులు పరిశీలించారు. డీలర్లు రైతులు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలని సూచించారు. పాడైపోయిన విత్తనాలు, మందులు, ఎరువులు అమ్మకూడదని సూచన చేశారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే మా లక్ష్యం

-కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నరసింహ

-వ్యవసాయాన్ని పండుగ చేసి చూపిస్తున్నాం

-9 రోజులలో 9 వేల కోట్లు రైతు ఖాతాలో జమ

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం






యాచారం సూర్య న్యూస్ ( జూన్ 25):. తెలంగాణలో రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నరసింహ అన్నారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ కిసాన్ మండల అధ్యక్షుడు లిక్కి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు.. తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలకు 9 రోజులలో 9 వేలకోట్ల రూపాయలు రైతు భరోసా రైతు ఖాతాలో జమ చేసిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. వ్యవసాయం అంటే దండగ కాదు అని, వ్యవసాయం అంటే రైతు ఒక పండుగలా చేసుకునే పండుగ నిరూపించారు. రైతులకు అండగా నిలిచి వారికి చేతుడు వాదోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మొట్టమొదటిగా రైతులకు ఉచిత కరెంటు ఇచ్చిందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేలు చేసే ప్రభుత్వమని అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని విమర్శ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్, డిసిసి అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, డిసిసి కార్యదర్శి ఉప్పల్ భాస్కర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వరికుప్పల తిరుమలేష్, కాంగ్రెస్ ఎస్టి సేల్ మండల అధ్యక్షుడు సప్పావత్ కిషన్ నాయక్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కానమోని జంగయ్య, గుర్రం రాజేందర్ రెడ్డి, పంది అంజి, పాశం జయప్రకాష్, మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మహమ్మద్ ఇబ్రహీం, కాంగ్రెస్ నాయకులు కేశమోని బిక్షపతి గౌడ్, మస్కు సిద్ధూ, మస్కు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం సీఐ ని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఇబ్రహీంపట్నం-నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (జూన్ 25) ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో మంగళవారం నూతనంగా సీఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన మహేందర్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిసిసి కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి, ఎలిమినేడు మాజీవార్డ్ మెంబర్ బజారు శ్రీశైలం, ఎలిమినేడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిట్టల యాదగిరి ఉన్నారు.

## మానవత్వానికి మరో రూపమే పట్టణ సీఐ విజయ్ కుమార్ 80 ఏళ్ల వృద్ధురాలని

### ఎఫ్ సి ఎన్ ఓల్డ్ ఏజ్ హెూమ్ లో చేర్పించిన పట్టణ సీఐ విజయకుమార్



షాద్ నగర్, నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్, (జూన్ 25) : సమాజంలో మానవత్వం లేని కుటుంబీకులు వద్దనుకున్నారు... అభం శుభం తెలియని 80 ఏళ్ల వృద్ధురాలిని అనాగరికంగా, షాద్ నగర్ పట్టణ రైల్వే స్టేషన్ రైల్వే ప్లాట్ఫామ్ పై వదిలివేశారు. దయగల హృదయముగల భగవంతుడు షాద్ నగర్ పట్టణ పెట్రోలింగ్ పోలీసుల కళ్ళలో ఆమెను పడేటట్లు చేశాడు. నిన్న రాత్రి పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న పోలీస్ శ్రీను, రైల్వే ప్లాట్ ఫారంపై పై ఒక 80 ఏళ్ల ముసలావిడ ఉండడం గమనించి వెంటనే పట్టణ సీఐ కు తెలుపగా దయార్ద్ర హృదయుడు, మంచి మానవత్వం కలిగిన సిఐ విజయకుమార్ వెంటనే స్పందించి ఆమె వివరాలు కనుక్కునే ప్రయత్నం చేయగా వివరాలు కూడా చెప్పలేని స్థితిలో ఉన్న ఆ ముసలావిడను




మానవత్వంతో లింగారెడ్డిగూడెం సమీపంలో నేషనల్ 44 హైవే పక్కన గల ఎఫ్ సి ఎన్ ఓల్డ్ ఏజ్ హెూమ్ నిర్వాహకులతో మాట్లాడి ఆమెను ఓల్డ్ ఏజ్ హెూమ్ లో చేర్పించారు. ఇంతకుముందు కూడా సిఐ విజయ్ కుమార్ శంషాబాద్ ఏరియాలో కూడా ఇలాగే ఎంతో మంది అనాథలుగా మిగిలిపోయిన వారిని ఓల్డ్ ఏజ్ హెూమ్ లో చేర్పించినట్టు సమాచారం. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి ఆదర్శంగా నిలుస్తున్న, ఖాకీ డ్రెస్ లో కూడా మానవత్వాన్ని ప్రదర్శిస్తున్న షాద్ నగర్ పట్టణ సిఐ విజయ్ కుమార్ తో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తున్న పోలీసులకు కూడా పట్టణ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ... వారు చూపిస్తున్న మానవత్వానికి, భగవంతుని మరో రూపంగా భావిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### ఆదర్శ పాఠశాల లో విద్యార్థులకు డ్రగ్స్ పై చిత్రలేఖన పోటీలు.




చింతపల్లి- నేటి ప్రభాత సూర్య (జూన్ 25) యాంటీ డ్రగ్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా చింతపల్లి ఆదర్శ పాఠశాలలో చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామ్ మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా సిఐ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐ రాజు మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్ద న్నారు. డ్రగ్స్ అలవాటుగా మారితే వారి జీవితాలు నాశనం అవుతా యన్నారు. తెలంగాణాను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం విద్యార్థులను చైతన్యవంతుల్ని చేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని సీఐ తెలిపారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా, విక్రయించినా, సేవించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్రగ్స్ నార్కోటిక్స్ వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖనంపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి.




రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, నేటి ప్రభాత సూర్య (జూన్ 25) భూ భారతి చట్టంలోని నిబంధనల మేరకు రెవెన్యూ సదస్సులలో వచ్చినదరఖాస్తులన్నింటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డిఆర్డిఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత ఆర్డీఓలు, తహశీల్దార్లతో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపైవీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన వ్యక్తులకు న్యాయం చేయాలన్నారు. కోర్టు కేసులు ఏమైనాఉన్నాయో తెలుసుకుని, ఒకవేళ కోర్టు ఆర్డర్ ఉంటే పట్టాదార్ పాసు పుస్తకాలుఇవ్వరాదని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ స్థలాలను గుర్తించిబోర్డులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రణాళికతో రెవెన్యూ సదస్సులలోవచ్చిన 21వేల దరఖాస్తులను జూలై 10వ తేదీ వరకు పరిష్కరించాలని కలెక్టర్ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సో డిఆర్ఓ సంగీత, కలెక్టరేట్ సూపరిటెండెంట్స్,ఆర్డిఓలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## 26న జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు

### జిల్లా యువజన క్రీడాల అధికారి శెట్టి వెంకటేష్

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట అదిలాబాద్ కరీంనగర్లలో నాలుగవ తరగతిలో ప్రవేశం కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకొని మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు మరియు నేరుగా ఈనెల 26న జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాల అధికారి శెట్టి వెంకటేష్ మంగళవారము ఒక ప్రకటనలో జిల్లాస్థాయిలో హాజరైన విద్యార్థులకు 9 మోటార్ క్వాలిటీ టెస్టులు నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన పదిమంది బాలురు పదిమంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపికకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్ జనన ధ్రువీకరణ పత్రం ప్రస్తుత పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ఐదు మూడవ తరగతి ప్రోగ్రెస్ కార్డ్ ఆధార్ కార్డు కుల ధ్రువీకరణ పత్రము వెంట తెచ్చుకోవాలని ఆయన తెలిపారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు ఉదయము 8 గంటలకు గ్రౌండ్లో రిపోర్టు చేయగలరు.

# నేటితో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు.. ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేసిన మోడీ




**న్యూఢిల్లీ,:** దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటితో 50 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఆనాడు ఎదురైనా పరిస్థితులు, ఇబ్బందులపై 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో ప్రత్యేక పుస్తకాన్ని తీసుకొస్తున్నట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ట్వీర్ ద్వారా మోడీ వెల్లడించారు. అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు తాను ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్నట్లు తెలిపారు. ఆ సమయంలో తన ప్రయాణం ఎలా సాగిందో డైరీలో ఉందని చెప్పుకొచ్చారు. ఎమర్జెన్సీ కాలంలో చాలా మందికి అనుభవాలు ఉన్నాయని.. ఎన్నో కుటుంబాలు బాధపడ్డాయని గుర్తుచేశారు. ఆనాటి పరిస్థితుల్ని యువతకు అవగాహన కల్పించాలని కోరారు. చీకటి రోజులను సోషల్ మీడియా ద్వారా పంచుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో 1975 నుంచి 1977 వరకు చీకటి రోజులుగా మోడీ అభివర్ణించారు. ఆనాటి పరిస్థితులపై మోడీ తొలి రాజకీయ జీవితంపై బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ "ది ఎమర్జెన్సీ డైరీస్-ఇయర్స్ దట్ ఫోర్జ్డ్ ఎ లీడర్" పేరుతో కొత్త పుస్తకాన్ని ఆవిష్కరించింది. ది ఎమర్జెన్సీ డైరీస్‌లో మోడీ వ్యక్తిగత జీవితం.. రాజకీయ ప్రస్థానం.. రాజకీయ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడంలో.. ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో మోడీ పాత్ర ఏంటి? అన్న విషయాలు ఈ పుస్తకంలో పొందిపరిచారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయంలో ఎమర్జెన్సీని ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా మోడీ ఎలా ఎదుర్కొన్నారో.. వాటి గురించి వివరణాత్మకంగా పుస్తకంలో ఉన్నాయని బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ వెల్లడించింది. ఇక మోడీతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తుల అభిప్రాయాలను కూడా ఇందులో పొందిపరిచారు. దేశంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి గురించి ఇలా పుస్తకం ముద్రించడం మొదటి ప్రయత్నంగా పేర్కొంది.

# హైకోర్టు కీలక తీర్పు.. స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్..!





**హైదరాబాద్, :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితిని తొలగించేలా.. రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. గత కొంతకాలంగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరగకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఈ అంశంపై ఆరుగురు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం హైకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ తరఫున న్యాయవాదులు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం మరో 30 రోజుల గడువు అవసరం అని తెలపడంతో హైకోర్టు ఆ అభ్యర్థనని పరిగణనలోకి తీసుకుంది. దీనితో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత, ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు కావాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యర్థనకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. దీనివల్ల కలిపి గరిష్ఠంగా 90 రోజుల లోపుల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనితో, 2024 సెప్టెంబర్ 30వ తేదీ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై పడనుంది. స్థానిక పాలన లోపిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు లేని పాలన వల్ల గ్రామీణాభివృద్ధి ఇబ్బందిగా మారుతుందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, పథకాల అమలు జాప్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు కోర్టుకు విన్నపించుకున్నారు.

## ఇరాన్ అణు స్థావరాలు ధ్వంసం చేశాం.. గౌరవంగా ఉందన్న ట్రంప్



**న్యూఢిల్లీ,:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ప్రస్తుతం శాంతి వాతావరణం నెలకొంది. మంగళవారం నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. తాజాగా ఇదే అంశంపై ట్రంప్ స్పందించారు. ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని ఆపగలిగినందుకు సంతోషంగా ఉందని చెప్పారు. ఇక ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేయడం తనకు లభించిన గొప్ప గౌరవంగా చెప్పుకొచ్చారు. యుద్ధం ఆపాలని ఇరాన్-ఇజ్రాయెల్ దేశాలు కోరాయని.. ఇరాన్ అణు కేంద్రాలు ధ్వంసం చేశాకే.. యుద్ధాన్ని ఆపినట్లు ట్రంప్ చెప్పారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో రాసుకొచ్చారు. ఇక నాటో సదస్సుకు వెళ్తుండగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో నాయకత్వ మార్పు గురించి స్పందిస్తూ అలా జరగాలని కోరుకోవడం లేదని చెప్పారు. అన్ని సమస్యలు త్వరలోనే సద్దుమణుగుతాయని.. పాలన మారితే గందరగోళ పరిస్థితులు నెలకొంటాయని అభిప్రాయపడ్డారు. ఇక టెహ్రాన్‌లో అణు కేంద్రాలను ధ్వంసం చేయడంలో అమెరికా విఫలమైందంటూ వచ్చిన మీడియా కథనాలపై ట్రంప్ రుసరుసలాడారు. ఈ వార్తలన్నీ నకిలీ వార్తలని.. ఇరాన్‌లో పూర్తిగా అణు కేంద్రాలు ధ్వంసం అయినట్లుగా ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. చరిత్రలో అత్యంత విజయవంతమైన సైనిక దాడులను కించపరుస్తారంటూ ట్రంప్ మండిపడ్డారు. అధ్యక్షుడ్ని కించపరిచే ప్రయత్నం చేస్తున్నారంటూ వైట్‌హౌస్ కూడా ఖండించింది. ఇదిలా ఉంటే టెహ్రాన్ అణు కేంద్రాలను నాశనం చేయలేదని అమెరికా నిఘా వర్గాలు కూడా భావిస్తున్నట్లు సమాచారం. కానీ ట్రంప్ మాత్రం ధ్వంసం అయ్యాయంటూ చెప్పుకుంటున్నారు. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య 12 రోజుల పాటు యుద్ధం సాగింది. మధ్యలో అమెరికా జోక్యం చేసుకుని ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేసింది. మంగళవారం ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ట్రంప్ ప్రకటించారు. అనంతరం ఇరాన్ క్షిపణి ప్రయోగించింది. దీంతో నలుగురు చనిపోయారు. ప్రతి దాడులు చేస్తామని ఇజ్రాయెల్ ప్రకటించగా.. అలాంటిదేమీ లేదని ఇరాన్ ఖండించింది. మొత్తానికి ఇరు దేశాల మధ్య శాంతి వాతావరణం నెలకొంది. ఇక దక్షిణ గాజాలో జరిగిన ఆపరేషన్‌లో ఏడుగురు ఇజ్రాయెల్ సైనికులు చనిపోయినట్లు ఐడీఎఫ్ బుధవారం తెలిపింది.

## 4013 ఫోన్ నెంబర్లను ట్యాపింగ్.. ఫోన్ ట్యాపింగ్ కేసులో విస్తుపోయే నిజాలు..!




**హైదరాబాద్, :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2023 నవంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు భారీగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా 4013 పోన్ నెంబర్లను ట్యాపింగ్ చేసింది ప్రణీత్ రావు అండ్ టీమ్. వీరిలో 618 మంది పొలిటికల్ లీడర్ల పోన్ ట్యాపింగ్ జరిగిందని సమాచారం. ఈ 618 మందిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ , పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్ట్ లకు సంబంధించినట్లుగా తెలుస్తోంది. ఇందులో ముఖ్యంగా రేవంత్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు, బండి సంజయ్ కుటుంబ సభ్యులు, ఈటెల రాజేందర్ ఆయన కుటుంబ సభ్యులు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యుల తొ పాటు అనుచరుల ఫోన్లు ట్యాప్ అయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మైనం పల్లి హనుమంత్ రావు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, మర్రి శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, పద్మా దేవేందర్ రెడ్డి , మర్రి జనార్ధన్ రెడ్డి, తాటి కొండ రాజయ్యలకు సిట్ నోటీస్ ఇవ్వనుంది. అలాగే ఐఏఎస్ లు రోనాల్డ్ రాస్, గౌతంల ఫోన్లు సైతం ట్యాపింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ కేసులో భాగంగా ఇప్పటివరకు 228 మంది స్టేట్మెంట్ రికార్డింగ్ లు పూర్తి చేసారు అధికారులు.

# యురేనియంను దాచేసింది!

### దాంతో 10 అణుబాంబులను తయారుచేసే ఛాన్స్

### 16 ట్రక్కుల్లో తరలించిందా?

### బంకర్ బస్టర్ దాడులకు ముందే యురేనియంను తీసుకెళ్లారా?

### ఉపగ్రహచిత్రాలతో మొదలైన కొత్త అనుమానాలు

### ప్రపంచవ్యాప్తంగా అణుభయాలను పెంచేస్తున్న ఇరాన్



గుట్టుచప్పుడుకాకుండా వేల కేజీల బరువైన బంకర్ బస్టర్ బాంబులేసి పర్వతగర్భ ఫోర్డో అణుకేంద్రాన్ని నాశనంచేశానని అమెరికా ఆనందపడేలోపే తాజా ఉపగ్రహ చిత్రాలు కొత్త భయాలను మోసుకొచ్చాయి. దాడులు ఖాయమన్న అంచనాతో ఇరాన్ సైన్యం ముందుగానే ఆ అణుకేంద్రం నుంచి వందల కేజీల అత్యంతశుద్ధమైన యురేనియంను అక్కడి నుంచి వేరే చోటుకు తరలించిందన్న వార్త ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఎంతో కష్టపడి శుద్ధిచేసిన యురేనియంను గాల్లో దీపంలా అలా అణుకేంద్రంలో నిర్లక్ష్యంగా వదిలేసేంత అమాయకత్వం ఇరాన్‌కు లేదని, ఎంతో తెలివిగా యురేనియం నిల్వలను వేరే చోటుకు తీసుకెళ్లిందని వార్తలు వెలువడ్డాయి. ఈ వార్తలకు బలంచేకూరేలా అమెరికా వైమానిక దాడులకు ముందే న్యూక్లియర్ సెంటర్‌కు కొన్ని భారీ ట్రక్కులు వచ్చి వెళ్లినట్లు తాజా ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇవేం తెలీకుండానే యురేనియంలేని న్యూక్లియర్ కేంద్రంపై అమెరికా హడావిడిగా బాంబులేసిందని కొందరు చెబుతున్నారు.

## పక్కా ప్రణాళికతో..

చిన్నని స్థూపాకార ఉక్కు బ్యారెళ్లలో 400 కేజీల అత్యంత శుద్ధ యురేనియంను ఫోర్డో యురేనియం శుద్ధి కర్మాగారం నుంచి ఇరాన్ రహస్య ప్రాంతానికి తరలించిందని వార్తలొచ్చాయి. ఈ చిన్న బ్యారెళ్లను తర్వాత చిన్న వాహనాల్లోకి మార్చి తరలించవచ్చు. కారు డిక్కీలో పెట్టి ఎవ్వరికీ అనుమానం రాకుండా ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. 400 కేజీల యురేనియంతో దాదాపు 10 అణుబాంబులను తయారుచేయొచ్చు. అణుకేంద్రంలో ఉండాల్సిన ఈ పేలుడు పదార్థం ఇప్పుడు లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ చీఫ్ రఫేల్ మారియానో గ్రస్సీ సైతం ధృవీకరించినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత శాంతిచర్చలకు సిద్ధమైతే, తమ వద్ద యురేనియం నిల్వలు ఉన్నాయని బెదిరించి ఇరాన్ తన డిమాండ్లను సాధించే వీలుంది. " చర్చల సమయంలో ఇరాన్ ఇదే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించి తమ డిమాండ్లు నెరవేరాలని కోరవచ్చు. ఈ సమస్యకు పరిష్కారం వెతకాల్సి ఉంది. ఏదేమైనా బాంబులు పేల్చి మేం వాళ్ల యురేనియం శుద్ధి కేంద్రాలను నాశనంచేశాం. ఇప్పట్లో ఇరాన్ మళ్లీ అణుశుద్ధిని మొదలుపెట్టడం అసాధ్యం" అని ఏబీసీ వార్తాసంస్థతో జేడీ వాన్స్ చెప్పారు. ఈ అంశంపై రఫేల్ మారియానో సీఎన్ఎన్, ది న్యూయార్క్ టైమ్స్ వార్తాసంస్థలతో మాట్లాడారు. "ఇందులో దాచాల్సిందేమీ లేదు. అంతా బహిరంగ రహస్యమే. తమ యురేనియం నిల్వలను కాపాడుకునే దమ్ము తమకు ఉందని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఆ యురేనియంతో అణుబాంబును తయారుచేయడం కుదరదు. కనిపించకుండా పోయిన యురేనియం శుద్ధత కేవలం 60 శాతమే. 90 శాతం శుద్ధత ఉంటేనే అణుబాంబుకు అక్కరకొస్తుంది. దాడులకు ఒక వారం ముందు అణు ఇంధన ఏజెన్సీ పర్యవేక్షణ బృంద సభ్యులు ఇస్ఫహాన్ అణుకేంద్రానికి వెళ్లినప్పుడు అక్కడ యురేనియం నిల్వలను చూశారు" అని రఫేల్ వెల్లడించారు.

## ఆ 16 ట్రక్కులు ఎక్కడ?


ఫోర్డో భూగర్భ అణుకేంద్రం ముఖద్వారం వద్దకు దాడులకు ముందు 16 పటిష్టమైన ట్రక్కులు వచ్చినట్లు మాక్సార్ టెక్నాలజీస్ సంస్థ వారి ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ట్రక్కుల నిండా ఏవో బ్యారెళ్లను నింపి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ట్రక్కులు ఇప్పుడు ఎక్కడున్నాయో ఎవరికీ తెలీదు. అయితే ట్రక్కులపై అమెరికా నిఘా వర్గాలు ఓ కన్నేశాయని, ట్రంప్ అనుమతి వచ్చాక వాటిపై దాడులుచేసేందుకు అమెరికా సేనలు సిద్ధంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియాతో మరో కథనం వెలువడింది.

# విరమణ... నిజంగానా?!




ఎప్పటిలాగే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బహుపాత్రాభినయంతో అందరినీ మెప్పిస్తున్నారు. పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు సాగించిన కొన్ని గంటలకే ఇరాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు అంగీకరించాయని, దాన్ని తాము స్వాగతిస్తున్నా మని మంగళవారం మధ్యాహ్నం ట్రంప్ ప్రకటించారు. దీనికి ఇరాన్ సానుకూలంగా స్పందించినా ఇజ్రాయెల్ మౌనం పాటించింది. ట్రంప్ ప్రకటించిన కాసేపటికే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అది బాంబుల వర్షం కురిపించింది. రెండు దేశాలూ పరస్పరం 'ఎందుకో కూడా తెలియని' విధంగా కాల్పుల విరమణ ఒడంబడికను ఉల్లంఘిస్తున్నాయని ట్రంప్ నిందించి తన 'తటస్థతను' చాటు కున్నారు! ఇంతకూ కాల్పుల విరమణ నిజమేనా? ఒక సమాచారం ప్రకారం ఖతార్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించాక ట్రంప్ చొరవ తీసుకుని ఇరాన్‌తో మాట్లాడి కాల్పుల విరమణకు ఒప్పించమని ఖతార్‌ను కోరారు. ఖతార్ తీసుకొచ్చిన ప్రతిపాదనకు ఇరాన్ అంగీకారం తెలిపింది. ఇరాన్ ఈ సంగతి బాహాటంగానే చెప్పింది. కాల్పుల విరమణ గురించి ట్రంప్ బతిమా లుకున్నారని వెల్లడించింది. అయితే ట్రంప్ ప్రకటన తర్వాత కాసేపటికే దాడులకు దిగడాన్నిబట్టి ఇజ్రాయెల్‌కు ఈ పరిణామం ససేమిరా ఇష్టం లేదని బోధపడుతోంది. యుద్ధం ఆపటం సులభ మేమీ కాదు. కాల్పుల విరమణ ప్రకటనకూ, దాని ఆచరణకూ మధ్య గంటలు మాత్రమే కాదు... రోజుల వ్యవధి కొనసాగటం రివాజే. మొన్న భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పంద మైనా, రష్యా-ఉక్రెయిన్‌ల కాల్పుల విరమణ అయినా ఈ సంగతే చెబుతాయి. యుద్ధానికి ముందు నెల నుంచి ట్రంప్ ఇరాన్‌కు రోజువారీ హెచ్చరికలు జారీచేస్తూ వచ్చారు. అణు ఒప్పందంపై మొండి పట్టుదలకు పోతే దేశం సర్వనాశనమవుతుందని బెదిరించారు. ఆఖరికి ఒకపక్క ఇరాన్ అమెరికాతో చర్చలు సాగిస్తుండగానే పన్నెండు రోజుల క్రితం ఇజ్రాయెల్ ఎలాంటి కవ్వింపూ లేకుండా ఆ దేశంపై దాడులు సాగించి ఇరాన్ సైనిక దళాల చీఫ్‌లు ఇద్దరినీ, అణు శాస్త్రవేత్తలతోసహా పలువురినీ హత్య చేసింది. ఇది తప్పని చెప్పాల్సిన ట్రంప్... ప్రతీకార దాడులకు దిగితే ఖబడ్దార్ అంటూ తిరిగి ఇరాన్‌నే హెచ్చరించారు. ఆఖరికి శనివారం అర్ధరాత్రి దాటాక అమెరికా తానే రంగంలోకి దిగి బంకర్ బస్టర్ బాంబులతో ఇరాన్‌లో మూడు అణు స్థావరాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. ఇంతా అయినాక హఠాత్తుగా ట్రంప్ కొత్త రాగం అందుకున్నారు. ఏకపక్ష యుద్ధం ప్రారంభానికి పూర్వమే ఇరాన్ బలహీనతలు బయటపడ్డాయి. దశాబ్దాల ఆంక్షలతో అన్నివిధాలా దెబ్బతిన్న దేశం మెరుగ్గా ఉండగలదని ఎవరూ భావించలేరు. ఒకపక్క నేరుగా అమెరికా, ఇజ్రాయెల్ కుటిలత్వం తెలుస్తున్నా మిత్రులనుకున్నవారు కూడా ఖండించ టానికి సిద్ధపడకపోవటం... అండగా ఉండగలవని భావించిన రష్యా, చైనాలు ప్రకటనలకే పరిమితం కావటం, గల్ఫ్ దేశాలు నామమాత్రంగా ఖండించి ఊరుకోవటం ఇరాన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసి ఉంటాయి. అణు ఒప్పందానికి సిద్ధపడతామని ప్రకటించి ఆ దిశగా అడుగులేస్తున్న దేశం ప్రపంచంలో ఇలా ఏకాకిగా మిగిలిపోవటం వర్తమాన విషాదం. యుద్ధం పర్యవసానంగా ఇరాన్‌లో పలు దేశాల పెట్టుబడులు దెబ్బతింటాయి. పైగా ప్రపంచానికి పెద్ద పోలీసుగా వ్యవహరిస్తూ తాము చెప్పిందే ఒప్పందమని ఒత్తిడి తెచ్చే ధోరణి రేపన్నరోజు ఎవరికైనా ముప్పే. ఇజ్రాయెల్ దగ్గర... ఆ మాటకొస్తే పశ్చిమాసియాలో అణుబాంబుల జాడలేకపోతే, ఇరాన్ మాత్రమే ఆ పని చేస్తే దాన్ని నియంత్రించటంలో హేతుబద్ధత ఉన్నదని నమ్మినా తప్పుబట్టనవసరం లేదు. కానీ అసలు అమెరికా, రష్యా మొదలుకొని ఏకపక్ష యుద్ధాలతో అందరూ తమ బాధ్యతారాహిత్యాన్ని బయటపెట్టుకుంటుండగా ఒక్క ఇరాన్ మాత్రమే ధూర్త దేశమని ఎందుకు భావించాలి? ఇంతకూ ట్రంప్ హఠాత్తు నిర్ణయం వెనకున్న కారణాలేమిటి? సైనిక స్థావరంపై దాడి చేస్తున్నా మని ఇరాన్ ముందస్తు సమాచారం ఇవ్వటం, అందుకు అనుగుణంగా అమెరికా తన సైనికుల్ని తరలించటంతోపాటు క్షిపణుల్ని కూల్చే ఏర్పాటు చేసుకోవటం సాధ్యమైంది. ఒకే ఒక్కటి పేలినా దానివల్ల నష్టం లేదు. అది ట్రంప్‌కు నచ్చినట్టుంది. దానికితోడు ఆయన అందలం ఎక్కటంలో కీలకపాత్ర పోషించిన 'మాగా' ఈ యుద్ధంపై చీలిపోయింది. గట్టి మద్దతుదారైన స్టీవ్ బెనన్ లాంటివారు సైతం ట్రంప్‌ను తప్పుబట్టారు. ఆ ఒత్తిళ్ల మాటెలావున్నా యూరప్ నుంచి వస్తున్న వార్తలు అమెరికాను భయపెట్టి ఉండాలి. అమెరికా తర్వాత బంగారం నిల్వల్లో రెండు, మూడు స్థానాల్లో ఉన్న జర్మనీ (3,352 టన్నులు), ఇటలీ (2,452 టన్నులు) ఆ నిల్వల్లో మూడోవంతు భాగాన్ని అమెరికా ఫెడరల్ రిజర్వ్‌లో ఉంచాయి. దాన్ని వెనక్కుతేవాలని ఆ దేశాల్లో డిమాండ్లు బయల్దేరాయి. నిల్వల విలువ 24,500 కోట్ల డాలర్ల పైమాటే. ఫెడరల్ రిజర్వ్ స్వతంత్రతను దెబ్బతీసేలా ట్రంప్ వ్యవహరించటం, ప్రపంచాన్ని అస్థిరపరిచే నిర్ణయాలు తీసుకోవటం తదితర కారణాల వల్ల అమెరికాలో బంగారం ఉంచటం సురక్షితం కాదని విపక్షాలు వాదిస్తున్నాయి. అది ఆచరణ రూపందాలిస్తే అమెరికా ఆర్థికవ్యవస్థ మరింత కుంగిపోవటం ఖాయం. పైగా లండన్‌తో పాటు ప్రపంచంలోనే కీలకమైన బంగారం కేంద్రంగా వెలిగిపోతున్న న్యూయార్క్ కళ అడుగంటు తుంది. అందుకే ట్రంప్ పునరాలోచనలో పడ్డారా? లేక ముందస్తు సమాచారం ఇచ్చిన ఇరాన్ 'మంచితనం' నచ్చిందా? మొత్తానికి అగ్ని గుండం కాబోతున్న పశ్చిమాసియాలో సామరస్య గాలులు వీచటం ఆహ్వానించదగ్గది. ఇది పూర్తి స్థాయిలో సాకారం కావాలని ఆశించాలి.

# ఇరాన్ పాశుపతాస్త్రం.. హర్మూజ్



ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధంలో అగ్రరాజ్యం అమెరికా ఊహించిన దానికన్నా ముందుగానే ప్రవేశించడమే కాకుండా ఇరాన్ అణుస్థావరాలపై భీకర దాడులకు దిగడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇంతవరకు ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పోరుగానే ఉన్న ఈ యుద్ధం ఇప్పుడు అమెరికా రంగప్రవేశంతో మూడో ప్రపంచ యుద్ధానికి లేదా అణుయుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందా అనే భయాలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై దాడి చేసే విషయంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్తూ వచ్చిన ట్రంప్ ఆ ప్రకటన చేసిన రెండు రోజులకే హటాత్తుగా ఇరాన్ అణుస్థావరాలపై మెరుపుదాడులు చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ దాడి జరిగిన తర్వాత ఇరాన్ తమ అణుస్థావరాలపై దాడి చేయడం ద్వారా అమెరికా 'పెద్ద రెడ్‌లైన్'ను దాటేసిందని, దీనికి ఆ దేశం శాశ్వతమైన ప్రతిఫలాన్ని అనుభవించక తప్పదని కూడా హెచ్చరించింది. ఇంతకీ భారత్- పాకిస్థాన్ మధ్య అణుయుద్ధం సంభవించకుండా తానే చొరవ తీసుకుని ఇరుదేశాలను కాల్పుల విరమణకు అంగీకరింపజేశానని, నోబెల్ శాంతి బహుమతి తనకే దక్కాల్సి ఉందంటూ గొప్పలు చెప్పుకుంటూ వచ్చిన ట్రంప్ మహాశయుడు ఇప్పుడు తానే స్వయంగా ఇరాన్‌పై ప్రత్యక్ష దాడులకు దిగడం ద్వారా మరో భీకర యుద్ధానికి ఎందుకు తెరదీశారనేది ఎవరికీ అర్థం కాని ప్రశ్న. ఇరాన్ అణ్వస్త్రాలను సమకూర్చుకోకుండా చేయడం కోసమే తాము ఈ దాడి చేశామని ట్రంప్ చెప్పుకోవచ్చు కానీ అందులో పూర్తి నిజం లేదని ప్రపంచ దేశాలన్నిటికీ తెలుసు. ఎందుకంటే ఇరాన్ చాలా సంవత్సరాలుగా యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. అంతేకాదు, ఏ క్షణంలోనైనా అణ్వస్త్రాన్ని తయారు చేయగల స్థితిలో ఉందని అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సైతం అంటున్నాయి. అందుకే అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంలో చేరాలని ఇరాన్‌పై ట్రంప్ తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. ఈ దిశగా ఇరుదేశాల మధ్య ఆరేడు విడతలుగా చర్చలు కూడా జరిగాయి. ఈ దశలో ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసే విధంగా భీకర దాడులకు దిగడంతో ఆ అవకాశాలు చేజారినట్లే. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టంనుంచి వైదొలగుతామని ఇరాన్ హెచ్చరించడమంటే తనకు నచ్చిన విధంగా అణు ఇంధనాన్ని శుద్ధి చేసుకోగలుగుతుంది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఐ)వంటి సంస్థల పర్యవేక్షణను కూడా అనుమతించదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇరాన్ మరింత వేగంగా అణ్వాయుధాలను తయారు చేసుకునే అవకాశం లభిస్తుంది.అయితే ఇరాన్ అంతటి సాహసం చేసే స్థితిలో ఇప్పుడు ఉందా అనేదే ప్రశ్న. గతంలో ఇరాన్ ఇజ్రాయెల్ ఘర్షణల సమయంలో ఏ దేశం ఎటువైపు ఉందో స్పష్టంగా తెలిసేది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. ఇరాన్‌పై అమెరికా దాడులను రష్యా, చైనాలు తీవ్రంగా ఖండించాయి. అయితే ఈ రెండు దేశాలు ఇరాన్‌కు నేరుగా సైనిక సాయం చేసే స్థితి లేదు. టర్కీ, ఖతార్, సౌదీఅరేబియా లాంటి గల్ఫ్‌దేశాల పరిస్థితి కూడా అలానే ఉంది. గతంలో ముస్లిం దేశాలన్నీ ఇరాన్‌కు అండగా నిలిచాయి. కానీ ఇప్పుడు అవి ప్రత్యక్షంగా ఇరాన్‌కు మద్దతుగా నిలిచేలా కనిపించలేదు. మరోవైపు భారత్ సహా పలు ఆసియా దేశాలు సైతం ఇరుపక్షాలకూ దూరంగా ఉంటున్నాయి. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సలహా ఇస్తున్నాయి. కానీ ఆ సలహాను అవి ఎంతమేరకు పాటిస్తాయనేది సందేహమే. ఇక ఇరాన్‌కు ఉన్న ఏకైక తురుపుముక్క హర్మూజ్ జలసంధిని మూసివేయడం. ప్రపంచంలో సముద్ర మార్గం ద్వారా రవాణా అయ్యే చమురులో 25 శాతం ఈ జలసంధి ద్వారానే సరఫరా అవుతుంది. కేవలం 33 కిలోమీటర్లు వెడల్పు ఉండే ఈ ఇరుకైన జలమార్గం గుండా వెళ్లే చమురు రవాణా నౌకలను అడ్డుకుంటే ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగిపోయే ప్రమాదం పొంచిఉంది. పెట్రోల్, డీజిల్ ధరల మంటలు ఎగసిపడితే ప్రపంచం ఆర్థికంగా దెబ్బతినడం ఖాయం. ఈ భయాలను బూచిగా చూపించి తమపై దాడులను ఆపాలని అమెరికా, ఇజ్రాయెల్ కూటమి దేశాలను ఇరాన్ హెచ్చరించే వీలుంది. మరో వైపు కువైట్, బహ్రెయిన్, ఖతార్, యుఎఇ వంటి గల్ఫ్ దేశాల్లోని అమెరికా వైమానిక స్థావరాలపై మెరుపుదాడులు చేసి ప్రతిదాడులను నిలువరించే అవకాశం ఉంది. ఈ భయంతోనే అమెరికా ఇప్పటికే ఒకటి, రెండు స్థావరాలనుంచి తమ యుద్ధవిమానాలను వేరే చోటికి తరలించినట్లు కూడా వార్తలు వచ్చాయి. అయితే ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడం తమ లక్ష్యం కాదని, దాని అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ప్రధాన లక్షమని అమెరికా, ఇజ్రాయెల్‌లు చెప్తూ ఉండడం గమనార్హం. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ చేతులనుంచి పాలనను తప్పించి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలనేదే అమెరికా ప్రధాన ఉద్దేశమని అంతర్జాతీయ విశ్లేషకులు అంటున్నారు. అన్నిటికన్నా మించి రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటినుంచి పలు వివాదాస్పద నిర్ణయాల ద్వారా ఇటు స్వదేశంలో, అటు ప్రపంచం దృష్టిలో బోలెడంత అపకీర్తిని మూటగట్టుకున్న ట్రంప్ మరింత దుందుడుకు చర్యలకు దిగుతారా? అన్నది ప్రధాన ప్రశ్న. ఓ వైపు రష్యా ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు గాజా సంక్షోభం సమస్యల్లో మధ్యవర్తిత్వానికి యత్నించి అవి ఫలించని నేపథ్యంలో ఈ రెండింటికన్నా క్లిష్టమైన ఇరాన్ ఇజ్రాయెల్ వివాదంలో తలదూర్చి కొరివితో తలగోక్కుంటారా? అయితే గతంలో ట్రంప్ పాలనను చూసిన చాలా మంది ఆయన సమస్యలను కొనితెచ్చుకోవడంలో సిద్ధహస్తుడని, ఇప్పుడు కూడా ఏమి చేస్తారో ఎవరూ ముందుగా ఊహించలేరని అంటున్నారు. అయితే పరిస్థితి అణుయుద్ధానికో, మూడో ప్రపంచ యుద్ధానికో దారి తీయకపోవచ్చని, అతి త్వరలోనే ఇరుపక్షాలు వాస్తవాన్ని అర్థం చేసుకుని ఓ అడుగు వెనక్కి వేస్తాయని మెజారిటీ విశ్లేషకుల అభిప్రాయం.

## ఢిల్లీ టూర్‌లో హీరోయిన్ మీనా.. బీజేపీలో చేరే అవకాశం



**న్యూఢిల్లీ,:** ప్రముఖ సీనియర్ హీరోయిన్ మీనా ఢిల్లీలో పర్యటించారు. పర్యటనలో భాగంగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను మీనా కలిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో మీనా పంచుకున్నారు. "మిమ్మల్ని కలవడం గౌరవంగా ఉంది.. మీ నుంచి చాలా నేర్చుకున్నాను. నా భవిష్యత్ నమ్మకంగా నడిపించడంలో నాకు సహాయపడుతుందని భావిస్తున్నా. మీ సమయానికి ధన్యవాదాలు" అంటూ మీనా రాశారు. ఇందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో రకరకాలైన ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. త్వరలోనే బీజేపీలో చేరనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు తమిళ మీడియాలో కూడా వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఇక అన్నాడీఎంకే-బీజేపీ మధ్య కూడా పొత్తు కుదిరింది. అధికారాన్ని చేజిక్కించుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులను పార్టీలో చేర్చుకోవాలని కాషాయ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే ఖుష్బు బీజేపీలో ఉన్నారు. మరికొందరిని పార్టీలో చేర్చుకుంటే బలం చేకూరుతుందని ఆ పార్టీ భావిస్తోంది. ఇందులో భాగంగానే మీనా ఢిల్లీకి వెళ్లినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఉప రాష్ట్రపతితో భేటీ అయిన తర్వాత ఆ వార్తలకు బలం చేకూరింది. త్వరలోనే ఆమె కాషాయ కండువా కప్పుకోవచ్చని పుకార్లు వినిపిస్తున్నాయి. 2009లో మీనా.. వ్యాపారవేత్త విద్యాసాగర్‌ను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక కుమార్తె ఉంది. అయితే 2022లో తీవ్ర అనారోగ్యంతో భర్త విద్యాసాగర్ చనిపోయారు. అప్పటి నుంచి మీనా.. కుమార్తెతోనే ఉంటుంది. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సినీ పరిశ్రమలో రాణించింది. ప్రస్తుతం రాజకీయాలపై వైపు అడుగులు వేస్తున్నారని.. ఇందులో భాగంగానే ఆమె బీజేపీలో చేరాలని భావించినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి



**హైదరాబాద్, :** భద్రాచలం పట్టణంలో ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే కవిత ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులతో 'ప్రగతి ఎజెండా' సమావేశాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించబడిన ఖమ్మం జిల్లాలోని భద్రాచలం ప్రాంతానికి చెందిన ఎటపాక, పిచ్చుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తమపట్నం, గుండాల గ్రామాల గురించి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని నాయకులను కోరుతున్నానని అన్నారు. ఆ ఐదు గ్రామాలకు న్యాయం జరగాలని తాను డిమాండ్ చేస్తున్నానని తెలిపారు. భౌగోళికంగా ఐదు గ్రామాలు తెలంగాణలో ఉన్నా అన్యాయంగా, అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారని ఆక్షేపించారు. ఆ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను చూసైనా వారిపై సానుభూతి చూపి, ఆ ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలి. ఈ ఐదు గ్రామ పంచాయతీలు పోలవరం ముంపు జాబితాలో, ప్యాకేజీ జాబితాలో లేవు..అని ఎమ్మెల్సీ కవిత రాసుకొచ్చారు.

## ఇళ్ల నిర్మాణానికి రూ.1కే అనుమతులు, సడలింపులు..!!



**అమరావతి,:** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పేదలకు ఇంటి నిర్మాణ అనుమతుల విషయం లో ఫీజు రాయితీ ప్రకటించింది. పట్టణ ప్రాంతాల్లో 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టే పేదలకు రూపాయికే అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ మార్గదర్శకాలు ఖరారు చేసింది. భవన నిర్మాణ విధి విధానాలు.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ రాయితీతో పాటుగా మినహాయింపులు దక్కనున్నాయి. పేదల ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలో ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. పట్టణ ప్రాంతా ల్లో 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పేదలు నిర్మించుకునే ఇళ్లకు రూపాయికే ఇక అనుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 3 మీటర్ల ఎత్తు దాటిన భవనాల్లో బాల్కనీలు గరిష్ఠంగా 1.5 మీటర్ల వెడల్పుతో నిర్మించుకునే అవకాశం కొత్తగా కల్పించింది. నివాస భవనాలకు సంబంధించి సెట్ బ్యాక్ (భవనం చుట్టూ విడిచిపెట్టే ఖాళీస్థలం)లోనూ వెసులు బాటు కల్పించింది. రెడ్ క్యాటగిరీ మినహా 9 మీటర్ల వెడల్పు ఉన్న రోడ్లలోనూ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతించింది. 100 చదరపు మీటర్ల (ప్లాట్) స్థలంలో నిర్మాణాలకు 2 మీటర్ల వెడల్పుగల అంతర్గత రోడ్డు, 100 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లకు 3.6 మీటర్ల వెడల్పుతో అంతర్గత రోడ్డు సరిపోతుంది. అదే విధంగా 100 చదరపు మీటర్ల నుంచి 500 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉన్న ప్లాట్‌కు ఫ్రంట్ సెట్‌బ్యాక్ 1 మీటరు నుంచి 3 మీటర్లు. భవనంలో మిగిలిన మూడు వైపులకు 0.75 మీటర్ల నుంచి 2 మీటర్లు ఉంచాల్సి ఉంటుంది. 500 చదరపు మీటర్లు మొదలుకుని 2,500 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉన్న ప్లాట్లకు ఫ్రంట్ సెట్‌బ్యాక్ 3 మీటర్ల నుంచి ఇంచుమించు 5.5 మీటర్లు, అదే విధంగా భవనంలో మిగిలిన మూడు వైపులకు ఇప్పటివరకు ఉన్న పాత నిబంధనలే వర్తిస్తాయని వెల్లడించారు. 2,500 చదరపు మీటర్ల పైబడిన విస్తీర్ణంలో ఉన్న ప్లాట్స్?కు కూడా 500 చదరపు మీటర్ల నుంచి 2,500 చదరపు మీటర్ల ప్లాట్‌కు ఉన్న సెట్‌బ్యాక్ నిబంధనలే కొనసాగనున్నాయి. 300 చ. మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే భవనాలకు సెల్లార్ పార్కింగ్‌కు అనుమతి లభించనుది. అదే ప్లాట్‌లో సెట్‌బ్యాక్ మార్చుకునే అవకాశం ఉంది.

## 13న వైభవంగా ఉజ్జయిని బోనాలు.. 14న రంగం

**హైదరాబాద్, :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాడం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అందుకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉజ్జయిని మహకాళి దేవస్థానంలో ఆషాడ జాతర బోనాలు ఉత్సవాలపై జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.వెంకట్రావు, అడిషనల్ సీపీ విక్రం సింగ్ మాన్, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆషాడా ఆ బోనాల ఉత్సవాలకు శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేస్తూ బోనాల జాతరను విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఉజ్జయిని మహాకాళి దేవస్థానం సికింద్రాబాద్లో జూలై 13న అమ్మవారికి బోనాలు సమర్పణ, 14 న రంగం (భవిష్యవాణి) అమ్మ వారిని అంబారిపై ఊరేగింపు కార్యక్రమం ఉంటోందని, రెండు రోజులలో భక్తులు, ప్రజలు లక్షల్లో తరలి వస్తారని ఆ దిశగా ఏర్పాట్లు కట్టుదిట్టం గా ఉండాలని మంత్రి సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ దేవాదాయ, పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాడం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అందుకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉజ్జయిని మహకాళి దేవస్థానంలో ఆషాడ జాతర బోనాలు ఉత్సవాలపై జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.వెంకట్రావు, అడిషనల్ సీపీ విక్రం సింగ్ మాన్, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# భారత ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ మాయని మచ్చ


### ఎమర్జెన్సీ, జగన్ పాలనపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

### గత ఐదేళ్ల రాష్ట్ర పాలన కూడా ఓ నియంతృత్వ కేస్ స్టడీ అని విమర్శ

### విజయవాడలో "సంవిధాన్ హత్యా దివస్" కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగం

### ఎమర్జెన్సీ నాటి నిర్బంధాలను, హక్కుల ఉల్లంఘనను గుర్తుచేసిన ముఖ్యమంత్రి

### కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే సుపరిపాలన దిశగా తొలి అడుగు వేసిందని వెల్లడి




అమరావతి: భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, అటువంటి నియంతృత్వ పోకడలు, అహంకారం ప్రజాస్వామ్యంలో ఎప్పటికీ చెల్లవని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి రాజ్యాంగ మూల సిద్ధాంతాలను ఎవరూ విస్మరించరాదని ఆయన హితవు పలికారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి (జూన్ 25) 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన "సంవిధాన్ హత్యా దివస్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య హననం

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 1975 జూన్ 25వ తేదీ భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన రోజని, దేశ చరిత్రలోనే అదొక చీకటి దినమని అభివర్ణించారు. "అది భారత రాజ్యాంగాన్ని, ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసిన రోజు. ఏకంగా 21 నెలల పాటు దేశమంతటా అత్యవసర పరిస్థితి విధించారు. ఇది తప్పు అని ప్రశ్నించిన వారిని జైళ్లలో పెట్టారు, సామాన్యులను హింసించారు, న్యాయ వ్యవస్థలను కబళించారు. ఇలా ఎన్నో అరాచకాలకు పాల్పడ్డారు" అని చంద్రబాబు ఆనాటి పరిస్థితులను గుర్తుచేశారు. 1975 జూన్ 12న అలహాబాద్ కోర్టు ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చినా, సుప్రీంకోర్టు ఆపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగి ప్రజల వద్దకు వెళ్లవచ్చని సూచించినా నాటి పాలకులు వినకుండా, అహంభావంతో ఎమర్జెన్సీ విధించారని తెలిపారు. జయప్రకాష్ నారాయణ, వాజ్‌పేయి, అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్ వంటి జాతీయ నాయకులతో పాటు రాష్ట్రానికి చెందిన అనేక మందిని నిర్బంధించారని, బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారని అన్నారు. 1984 ఆగస్టులో ఎన్టీఆర్ అమెరికా వెళ్లినప్పుడు, మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నప్పటికీ ఆయన ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా బర్తరఫ్ చేశారని, అయితే ఎన్టీఆర్ ప్రజాస్వామ్యవాదులతో కలిసి పోరాడి 30 రోజుల్లోనే తిరిగి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం ప్రజాస్వామ్య విజయమని చంద్రబాబు కొనియాడారు.

గత ఐదేళ్ల పాలనపై విమర్శలు

ఈ సందర్భంగా, రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ల పాలన కూడా నియంతృత్వానికి నిదర్శనమని చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. "పాలన ఎలా ఉండకూడదో చెప్పడానికి ఎమర్జెన్సీ ఒక కేస్ స్టడీ అయితే, పాలకులు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత ఐదేళ్ల పాలన మరో కేస్ స్టడీ" అని ఆయన వ్యాఖ్యానించారు. తాను కూడా ఆ పాలనలో బాధితుడినేనని, తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లు ప్రతిపక్ష నేతగా పనిచేసిన తాను ఇంతటి దారుణమైన పాలనను ఎన్నడూ చూడలేదని అన్నారు. అన్యాయాలు, అక్రమాలు, అవినీతితో చెలరేగిపోయారని, ప్రశ్నించిన వారి గొంతు నొక్కేశారని ఆరోపించారు. మోసాలు, దాడులు, అక్రమ కేసులు, రౌడీయిజం, ఆస్తులు రాయించుకోవడం వంటి అనేక అరాచకాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. కరోనా సమయంలో మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి, పిచ్చివాడిగా ముద్రవేసి ఆయన మరణానికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్య విలువలు, సుపరిపాలన

భారతదేశం 78 ఏళ్ల స్వాతంత్ర్య ప్రస్థానంలో ఎన్నో సవాళ్లను అధిగమించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందని చంద్రబాబు అన్నారు. మంచి చెడులను గుర్తుంచుకుని, భవిష్యత్ తరాలకు మంచిని అందించాల్సిన బాధ్యత ప్రజా జీవితంలో ఉన్న తమపై ఉందని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజల కోసం పనిచేస్తూ గోరా మరణించారని డాక్టర్ సమరం చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చెడులను తెలియజేయాలనే ఉద్దేశంతోనే ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా "సంవిధాన్ హత్యా దివస్" కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై మాట్లాడుతూ, "బీజేపీ, జనసేనలతో కలిసి ముందుకెళు _న్నాం. విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం వైపు నడిపిస్తామని చెప్పి ఒక్క ఏడాదిలోనే సుపరిపాలన దిశగా తొలి అడుగు వేశాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. మిత్రుడు పవన్ కల్యాణ్ కూడా ఎన్నో అవమానాలు ఎదుర్కొని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ముందుకు వచ్చారని ప్రశంసించారు. తనను అభిమానించిన తెలుగు ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ తరం వారికి ఎమర్జెన్సీ గురించి పెద్దగా తెలియకపోవచ్చని, వారంతా చరిత్రను చదువుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్‌ను, మన రాష్ట్రంలో స్వర్ణాంధ్రను సాధిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## 'బంగారు కుటుంబాల'కు అండగా 'మార్గదర్శులు': పీ4పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 (ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన) కార్యక్రమం అమలు తీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'మార్గదర్శుల' గుర్తింపు, 'బంగారు కుటుంబాల' ఎంపిక వంటి కీలక అంశాలపై ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. పీ4 విధానం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు చేయూత అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19,15,771 'బంగారు కుటుంబాల'ను గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీరిలో ఇప్పటివరకు 87,395 కుటుంబాలను 'మార్గదర్శులు' (స్వచ్ఛందంగా సహాయం చేసే వ్యక్తులు) దత్తత తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సమాజంలో చాలా మంది వివిధ రూపాల్లో పేదలకు సాయం చేయడానికి ఆసక్తి చూపుతున్నారని, అటువంటి వారికి పీ4 కార్యక్రమాన్ని ఒక మంచి వేదికగా మార్చాలని అన్నారు. 'మార్గదర్శులు'గా ఉండటానికి ముందుకు వచ్చేవారిని సంప్రదించి, వారిని 'బంగారు కుటుంబాల'తో అనుసంధానించే ప్రక్రియపై మరింత శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక కాల్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. 'మార్గదర్శులు'గా ఉండాలనుకునే వారికి అవసరమైన సమాచారం, మార్గనిర్దేశం అందించేలా వ్యవస్థలను పటిష్టం చేయాలని ఆదేశించారు. 'మార్గదర్శుల'తో 'బంగారు కుటుంబాల'ను అనుసంధానించిన తర్వాత, వారి జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి ప్రత్యేక సర్వేలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం అమలులో పారదర్శకత కోసం తప్పనిసరిగా ఆడిటింగ్ నిర్వహించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష జరపాలని, పీ4 కార్యక్రమ ప్రభావాన్ని నివేదికల రూపంలో ఎప్పటికప్పుడు 'మార్గదర్శకుల'కు కూడా తెలియజేయాలని స్పష్టం చేశారు. పీ4 కార్యక్రమ లక్ష్యాలను వివరిస్తూ, పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, ప్రముఖులు, ఉన్నత వర్గాల వారితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, వారిని 'మార్గదర్శులు'గా మారేందుకు ఆహ్వానించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో 'మార్గదర్శుల' భాగస్వామ్యం పెంచేందుకు దేశంలోని ప్రముఖ 100 కంపెనీలకు చెందిన సీఈఓలు, సీవోవోలు, సీఎఫ్ఓలు, ఎండీలు, ఛైర్మన్‌లతో తానే స్వయంగా మాట్లాడి పిలుపునిస్తానని చంద్రబాబు నాయుడు తెలిపారు. అంతేకాకుండా, దేశవిదేశాల్లో ఉన్న తెలుగువారితో వర్చువల్ విధానంలో సమావేశమై, ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను, ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించి, వారిని 'మార్గదర్శులు'గా ముందుకు వచ్చేలా ప్రోత్సహిస్తానని అన్నారు. ఎన్నారైలను పీ4 కార్యక్రమానికి సలహాదారులుగా నియమించి, తద్వారా మరింత మంది ఎన్నారైలు 'మార్గదర్శకులు'గా చేరేలా ప్రోత్సహించాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమీక్షలో భాగంగా, జీరో పావర్టీ, పీ4 కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు రూపొందించిన పలు లోగోలను ముఖ్యమంత్రి పరిశీలించారు. త్వరలోనే ఒక లోగోను ఖరారు చేయనున్నట్లు తెలిపారు. పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించిన మార్చి 30వ తేదీని ఏటా 'పీ4 వార్షికోత్సవం'గా నిర్వహించి, సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల పోరు.. బెంగాల్ పార్టీల జోరు



పశ్చిమ బెంగాల్ 2026 లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతోంది. మతపరమైన ఉద్రిక్తతలు, అలజడుల నేపథ్యంలో అధికార తృణమూల్ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, మళ్లీ పునరుజ్జీవన దశలో ఉన్న వామపక్షాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. బెంగాల్‌లో ఉపాధ్యాయుల సమ్మె, గూరా?లాండ్ టెరిటోరియల్ అడ్మినిస్ట్రేషన్ పై చర్చ, కేంద్ర బిజెపి మంత్రుల ఉన్నత స్థాయి సమావేశాలు చర్చకు కీలకం కానున్నాయి. బెంగాల్‌లో భారీగా పుంజుకున్న బిజెపి గత పదేళ్లలో భారతీయ జనతా పార్టీ ఎంతో ఎదిగింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధ్వర్యంలో టిఎంసి ఆధిపత్యాన్ని సవాల్ చేస్తూ, బలమైనశక్తిగా అవతరించింది. 2014లో కేవలం 4.6% ఉన్న ఓట్ల వాటాను 2019 నాటి లోక్‌సభ ఎన్నికల నాటికి 40.7 శాతానికి పెంచుకోగలిగింది. 42 లోక్‌సభ స్థానాల్లో ఏకంగా 18 స్థానాలను గెలుచుకుంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 77 స్థానాలను గెలుచుకుని ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. 2019 నుంచి బిజెపి పార్టీ స్థిరంగా మెరుగవుతోంది. 40 శాతంగా ఉన్న ఓటర్ల మద్దతును మరో 10% పెంచుకోవడం ద్వారా 2026 అసెంబ్లీ ఎన్నికలలో టిఎంసిని చిత్తుచేస్తుందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 2025లో అంచనా వేశారు. బిజెపి ఎదుగుదలకు ప్రధాన కారణం హిందూ ఓటర్లపై దృష్టి పెట్టడం. మతపరమైన వ్యూహాలు అనుసరించడం, అలాగే బ్రాహ్మణులు, కాయస్థ వంటి అగ్ర వర్ణాలను, సనాతనీయులను ఆకట్టుకోవడం. 294 సీట్లు ఉన్న అసెంబ్లీలో మెజారిటీ సాధించాలంటే, 148 సీట్లు తప్పనిసరి. ప్రతిపక్ష నేత సువేందు అధికారి నేతృత్వంలోని పార్టీ 5% ఫార్ములా అనుసరిస్తూ, కీలకమైన ఓటర్ల శాతాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని 80 వేల పోలింగ్ బూత్‌లలో ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రాంతాలను మినహాయించి, 57 వేల పోలింగ్ బూత్‌లను లక్ష్యంగా పెట్టుకుని, అట్టడుగు స్థాయినుంచి పార్టీని బలోపేతం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అయితే బిజెపి బెంగాల్‌లో పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. సుకాంత మజుందార్, సువేందు అధికారి, దిలీప్ ఘోష్ వంటి కీలక నాయకుల మధ్య విభేదాలు, అంతర్గత పోరు పార్టీ ఐక్యతను బలహీనపరుస్తున్నాయి. టిఎంసిపై వచ్చిన స్కామ్ ఆరోపణలు, ఉపాధ్యాయ నియామక కుంభకోణం, దానికి వ్యతిరేకంగా ఎగసిన నిరసనలను బిజెపి పార్టీ తనకు అనుకూలంగా మరల్చుకోలేకపోయింది. 2024లో ఆర్‌జికర్ మెడికల్ కాలేజీలో డాక్టర్‌పై అత్యాచారం, హత్యపై ప్రజలలో చెలరేగిన ఆగ్రహాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమైనందుకు విమర్శలపాలైంది. అంతే కాకుండా బిజెపి హిందూత్వ కథనం బెంగాల్‌లో సాంస్కృతికంగా ఉన్న ఉదారవాద భద్రలోక్ పై ప్రభావం చూపలేకపోయింది. టిఎంసి సంక్షేమ పథకాలపట్ల ఆకర్షితులైన గ్రామీణ ఓటర్లను ఆకట్టుకోవడానికి కష్టపడుతోంది. 2016 స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకల వల్ల 2014 లో సుప్రీంకోర్టు దాదాపు 26 వేల పాఠశాల టీచర్ల ఉద్యోగాలను రద్దుచేయడంతో అశాంతి చెలరేగింది. మాజీ ఉపాధ్యాయుడు ప్రబీర్ కర్మాకర్ వంటి రిటైర్డ్ ఉపాధ్యాయులు కొత్తగా పరీక్షలు లేకుండా టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. కోల్‌కతాలో రాష్ట్ర సచివాలయానికి ర్యాలీగా వెళ్తున్న 50 మందికి పైగా టీచర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో అలజడి చెలరేగింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో టిఎంసి ప్రభుత్వంపై వ్యతిరేక చెలరేగింది. విద్యారంగాన్ని భ్రష్టుపట్టించిన స్కామ్‌కు నిరసనగా బిజెపి శాసన సభ్యులు 2025 జూన్‌లో అసెంబ్లీనుంచి వాకౌట్ చేసారు. అయితే దీనిని స్పీకర్ బిమన్ బెనర్జీ తప్పుపట్టారు. కేసు కోర్టులలో ఉన్న దృష్ట్యా సభలో చర్చించడం సాధ్యం కాదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వల్ల ఇక్కట్ల పాలైన ఉపాధ్యాయులకు వ్యక్తిగత హోదాతో మద్దతు ఇస్తానని మమతా బెనర్జీ హామీ ఇచ్చినా, అశాంతి పూర్తిగా చల్లారలేదు. టీచర్ల ఆగ్రహాన్ని తనకు అనుకూలంగా మళ్లించడానికి బిజెపి ప్రయత్నించింది. సంక్షోభాన్ని పరిష్కరించేందుకు టిఎంసి చేస్తున్న యత్నాలకు వ్యతిరేకంగా కోల్‌కతాలో నిరసనలు కూడా నిర్వహించింది. కానీ, దాని ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. కేంద్ర బిజెపి మంత్రులు, ఎన్ఆర్ఐ డాక్టర్ల సమావేశం మరో ముఖ్య పరిణామం కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో సహా కేంద్ర బిజెపి మంత్రులు పార్టీ ప్రతిష్ఠను పెంచేందుకు ప్రవాస భారతీయ డాక్టర్ల (ఎన్ఆర్ఐలు) తో చర్చలు జరిపారు. 2025 జూన్‌లో అమిత్ షా కోల్‌కతా పర్యటనలో భాగంగా ఎన్నికల వ్యూహాలపై దృష్టిపెట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్, సువేందు అధికారితో రహస్య సమావేశం నిర్వహించారు. ఎన్ఆర్ఐ డాక్టర్ల సమావేశం వివరాలు పెద్దగా తెలియకపోయినా, బిజెపి దయాస్పోరా వర్గాలకు చేరువకావడంలో ఇది కొంత సహాయపడుతుంది. అమిత్ షా పర్యటనలో మతపరమైన అంశాలను ప్రస్తావించారు. వక్ఫ్ చట్టం సవరణపై టిఎంసి వ్యతిరేక ఎంతవరకూ ప్రభావం చూపుతుందని ప్రశ్నించారు. 2026లో మమతా బెనర్జీ పార్టీని ఏ మేరకు అధికారం నుంచి తప్పించగలం అన్న అంశాన్ని అంచనా వేశారు. షా ప్రయత్నం హిందూ- ముస్లింల మధ్య అంతరాలను పెంచే బిజెపి వ్యూహాన్ని తేటతెల్లం చేస్తోంది. అయితే ఈ వ్యూహం ఎన్నికల్లో లాభించింది. కానీ బెంగాల్‌లోని టిఎంసికి కీలక ఓటు బ్యాంక్‌గా ఉన్న 27 శాతం ముస్లిం జనాభాను పూర్తిగా బిజెపికి దూరం చేసే ప్రమాదం ఉంది. డార్జిలింగ్ హిల్స్‌లలో ప్రత్యేక గూరా?లాండ్ రాష్ట్రం కోసం డిమాండ్ వివాదాస్పద అంశంగా నిలిచిపోయింది. బిజెపి గూరా? జనముక్తి మోర్చా (జిజెఎం)కు మద్దతు ఇస్తూ 2009 నుంచి డార్జిలింగ్ లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుంటోంది. కానీ, గూరా?లాండ్‌ను అందించలేకపోయింది. దీంతో సంబంధాలు దెబ్బతిన్నాయి. ఫలితంగా 2020లో జిజెఎం నాయకుడు బిమల్ గురుంగ్ ఎన్‌డిఎ నుంచి వైదొలగి టిఎంసితో పొత్తుపెట్టుకున్నాడు. 2020 అక్టోబర్‌లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గూరా?లాండ్ సమస్యలపై త్రైపాక్షిక సమావేశాన్ని ఏర్పాటుకు సిద్ధమైంది. రాష్ట్రం ఏర్పాటు ప్రతిపాదనపై టిఎంసి అభ్యంతరం వ్యక్తం చేయడంతో జిటిఎపై దృష్టి పెట్టింది. ఎన్నికల సమయంలో గూరా? ఆకాంక్షలకు మద్దతు ఇచ్చి, తర్వాత వెనక్కి తగ్గడంతో బిజెపి విశ్వసనీయత కోల్పోయింది. ప్రత్యేక గూరా?లాండ్ రాష్ట్రం సాధ్యం కాదని దిలీప్ ఘోష్ 2020లో చేసిన ప్రకటన హిల్ ప్రాంతంలో ఓటర్లను బిజెపికి మరింత దూరం చేసింది. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గూరా?లు దూరం కావడం వల్ల బిజెపి ఉత్తర బెంగాల్‌లో తన పట్టుకోల్పోవచ్చు. గూరా?లకు రాష్ట్ర హోదా కల్పిస్తే, బెంగాల్ మైదాన ప్రాంతాల ప్రజల్లో వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉంది. దీంతో బిజెపి ఈ అంశంపై జాగ్రత్తగా వ్యవహరించాలి. 2026 అసెంబ్లీ ఎన్నికలు బిజెపి, టిఎంసిలకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవి. 2021లో మొత్తం 294 స్థానాల్లో 213 స్థానాలను గెలుచుకున్న టిఎంసి తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. గ్రామీణ ఓటర్లు ఆ పార్టీకి కంచుకోట. మహిళలను లక్ష్యంగా చేసుకుని మమత అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ముస్లిం ఓటు బ్యాంక్ టిఎంసికి మరింత అండగా నిలుస్తున్నాయి. 2025ఫిబ్రవరిలోనే మమతా బెనర్జీ "ఖేలా బర్ హొబే" (ఆట మళ్లీ మొదలవుతోంది) అన్న నినాదంతో తొలి ప్రచారం ఆరంభించారు. ఓటర్ల జాబితా రిగ్గింగ్ చేయడం ఎన్నికల్లో అక్రమాలకు బిజెపి పాల్పడుతుందని ఆరోపించారు. అయితే, ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో మహిళా డాక్టర్ రేప్, హత్య, ఎస్ఎస్‌సి స్కామ్ వంటి అంశాల వల్ల పట్టణ ప్రజల్లో ఉన్న అసంతృప్తి టిఎంసికి సవాల్‌గా మారుతోంది. బెంగాల్‌లో బిజెపి సంస్థాగతంగా పలు సమస్యలను ఎదుర్కొంటోంది. బిజెపి తన 40% ఓట్లను పెంచుకొని టిఎంసిని అధిగమించడానికి కీలక మార్పు అవసరం. అయితే, అంతర్గత కలహాలు, బెంగాలీ ఓటర్లతో సాంస్కృతికపరమైన సంబంధాలు లేకపోవడం ఆ పార్టీకి అడ్డంకిగా మారాయి. వక్ఫ్ చట్ట సవరణతో 2025 ఏప్రిల్‌లో ముర్షిదాబాద్‌లో చెలరేగిన ఘర్షణలు, మతపరమైన అశాంతి, హిందూ ముస్లింల అంతరాన్ని తీవ్రతరం చేసింది. ఇది టిఎంసి, బిజెపి రెండు పార్టీలకు కాస్త ప్రయోజనం చేకూరినా, చిన్న భాగస్వామ్య పార్టీలను దూరం చేసింది. 2011 వరకూ దాదాపు 34 సంవత్సరాలు పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న సిపిఎం ఆధ్వర్యంలోని లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తోంది. చారిత్రక భూ సంస్కరణలు, గ్రామీణ ప్రాంతాలలో వామపక్షాలపట్ల ఇంకా మద్దతు చెక్కుచెదరకుండానే ఉంది. ముఖ్యంగా టిఎంసి, బిజెపి ద్విముఖత్వంతో నిరాశ చెందిన యువత వామపక్షాలు వైపు చూస్తున్నాయి. ముర్షిదాబాద్‌లో అశాంతి చెలరేగిన సమయంలో విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలను సిపిఎం నాయకుడు మొహమ్మద్ సలీం ఖండించడంతో ఇప్పటి తాను లౌకిక ప్రత్యామ్నాయంగా నిలువగలనని లెఫ్ట్ ఫ్రంట్ వ్యూహాన్ని హైలైట్ చేస్తోంది. అయితే, 2011 నుంచి వామపక్షాల ఓటు శాతం తగ్గడం, కాంగ్రెస్ వంటి పార్టీలతో పొత్తుల వల్ల అంతంత ప్రయోజనం లేకపోవడంతో వామపక్షాల ఎన్నికల విజయావకాశాలు అనిశ్చితంగానే ఉన్నాయి. టిఎంసి సంక్షేమ పథకాలు ఆధిపత్యం చెలాయిస్తున్న గ్రామీణ ఓటర్లపై వామపక్షాలు పట్టు సాధించాలంటే వినూత్న వ్యూహాలు అవసరం. ఆర్‌జి కార్ సంఘటన తర్వాత ప్రజల నిరసనలకు వామపక్షాలు ఇచ్చిన మద్దతు వల్ల ప్రజలలో ఆకర్షణ పెరిగింది. ఇది భద్రలోక్‌లో బిజెపి లాభాలకు అడ్డుకట్ట వేయవచ్చు. పశ్చిమ బెంగాల్ రాజకీయ రంగం సంక్లిష్టమైన రణరంగం. ఇక్కడ మతం, సాంస్కృతిక, ఆర్థిక సమస్యలు కీలక పాత్ర వహిస్తాయి. మత రాజకీయాలు, సంస్థాగత ప్రయత్నాలు బిజెపికి ప్లస్ పాయింట్ అయినా, అంతర్గత కొట్లాటలు, సాంస్కృతిక పరమైన సవాళ్ల వల్ల నష్టపోవలసి వస్తోంది. ఉపాధ్యాయుల సమ్మె, ఎస్ఎస్‌సి స్కామ్ వల్ల టిఎంసిపై వ్యతిరేకత పెరిగింది. అయితే, గ్రామీణ ప్రాంతాలలో మమతకు గల పట్టు, ముస్లింల మద్దతు ఆమెను ముందుండి నడిపిస్తున్నాయి. గూరా?లాండ్ సమస్యల బిజెపికి రెండువైపులా పదును ఉన్న కత్తిలా మిగిలి పోయింది. అయితే వామపక్షాల పునరుజ్జీవనం టిఎంసి బిజెపి ద్వంద్వ వైఖరిని దెబ్బతీస్తుంది. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ, ఈ అంశాల నేపథ్యంలో టిఎంసి తన ఆధిక్యతను నిలుపుకుంటుందా. బెంగాల్ గద్దెనెక్కాలన్న బిజెపి కల నిజమవుతుందా అన్నది కోటి డాలర్ల ప్రశ్న. వామపక్షాలు బలహీనంగా ఉన్నప్పటికీ గట్టి పోటీ ఇచ్చి ఫలితాలను సాధించడంలో కీలక పాత్ర పోషించవచ్చు.

నేటి ప్రభాత సూర్య జాతీయ తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

## ఎంతకాలం ఈ 'పంచాయతీ'!

### (విశ్లేషణ)

రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో గద్దెనెక్కేవారు పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల విషయంలో మీనమేషాలు లెక్కించటం పరిపాటయింది.దేశంలో దాదాపు అన్ని చోట్లా ఇదే పోకడ. పల్లెసీమల్లో ప్రజాతంత్ర భావన పెంపొందించి, పంచాయతీరాజ్ సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా పనిచేయనివ్వాలని... వాటికవే అభివృద్ధి ప్రణాళికలను స్వతంత్రంగా రూపొందించుకోవటానికి అవకాశమీయాలన్న సంకల్పంతో మూడున్నర దశాబ్దాల క్రితం 73వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు.కానీ ఇప్పటికీ చాలా ప్రభుత్వాలు ఆ సంస్కృతికి పాతరేస్తున్నాయని పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇటీవలి నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామ పంచాయతీ కాలపరిమితి ముగిసేలోపు లేదా గడువుతీరిన ఆర్నెల్లలోగా ఎన్నికలు పూర్తి చేయాలని రాజ్యాంగంలోని 243 ఈ (3) నిర్దేశిస్తోంది. ఎన్నికలు సకాలంలో నిర్వహించని రాష్ట్రాలకు కేంద్రంనుంచి పంచా యతీలకు రావాల్సిన నిధులు ఆగిపోతున్నాయి. పర్యవసానంగా అభివృద్ధి కుంటుపడుతోంది. గ్రామాలు పారిశుద్ధ్య లేమితో, అందువల్ల కలిగే అంటువ్యాధులతో ఇబ్బంది పడుతున్నాయి.పంచాయతీ ఎన్నికలు వాయిదా వేయటానికి రాష్ట్ర ప్రభుత్వాలు వేనవేల సాకులు చెబుతుంటాయి. అందులో రిజర్వేషన్ల నిర్ధారణ ఒకటి. పారదర్శకత పాటించకుండా, నిబంధనలకు విలు వీయకుండా రూపొందించే ఆ రిజర్వేషన్లు ఎటూ వివాదాస్పదంగా మారి న్యాయస్థానాల పరిశీలనకు వెళ్తాయని, దాన్ని సాకుగా చూపి ఎన్నికలు వాయిదా వేయొచ్చని చాలా ప్రభుత్వాలు అనుకుంటున్నాయి. ఈ విషయంలో కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అగ్రస్థానంలో ఉంది.ఆఖరుసారి 2006లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన ఆ కేంద్రపాలిత ప్రాంతం ఆ తర్వాతనుంచి ఏదో ఒక కారణం చూపిస్తూ వాయిదాల్లోనే కాలక్షేపం చేస్తోంది. సిగ్గుచేటైన సంగతేమంటే... అక్కడ ఫ్రెంచ్ పాలన సాగినన్నాళ్లు స్థానిక సంస్థలు అద్భుతంగా పనిచేశాయి. అభివృద్ధి పనుల ప్రణాళికలు ఒక క్రమపద్ధతిలో అమలయ్యాయి. తీరా స్వాతంత్ర్యం వచ్చాక ఆ సంస్థలు నీరసించాయి.అధికారంలోకి ఎవరొచ్చినా ఏదో వంకతో వాటి ఎన్నికలు వాయిదా వేస్తూ పోయారు. 1954లో జరిగిన రిఫరెండమ్ ద్వారా భారత్‌లో విలీనానికి మెజారిటీ ప్రజలు సుముఖత వ్యక్తం చేయగా, 1962లో అది పూర్తి స్థాయి కేంద్రపాలిత ప్రాంతమైంది. 1968-2024 మధ్య కేవలం ఒకే ఒక్కసారి 2006లో పంచాయతీరాజ్ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలైనా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల పుణ్యమే.అంటే గడిచిన 56 ఏళ్లలో ఒకే ఒక్కసారి మినహా పుదుచ్చేరిలోని 108 పల్లెల బాగోగులు చూసే ప్రజాతంత్ర వ్యవస్థలే లేవన్నమాట! చిత్రమేమంటే... వివిధ అంశాల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటివి కూడా సకాలంలో ఎన్నికలు నిర్వహించటంలో విఫలమయ్యాయి. ఇప్పటికి నాలుగేళ్లుగా కర్ణాటకలో పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు లేవు.మహారాష్ట్ర మూడేళ్లనుంచీ, అస్సాం, జమ్మూ-కశ్మీర్ వంటివి రెండేళ్లనుంచీ ఎన్నికలు నిర్వహించటం లేదు. తెలంగాణ, తమిళనాడు, ఉత్తరాఖండ్‌లలో గతేడాది ఎన్నికలు జరగాల్సివుంది. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ అసెంబ్లీ సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది కనుక త్వరలోనే పంచా యతీ ఎన్నికలకు మార్గం సుగమం అవుతుందని ఆశించాలి.రాజ్యాంగంలో ఎన్ని ఉన్నతాశయాలున్నా ఆచరణ సరిగా లేనప్పుడు అవన్నీ నీరుగారి పోతాయి. అందులో పల్లెసీమల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడే పంచాయతీరాజ్ సంస్థలను నిర్లక్ష్యం చేయటం ఒకటి. నిజానికి నిర్దిష్ట కాలంలో సక్రమంగా ఎన్నికలు జరిగేచోట సైతం ఆ సంస్థల పనితీరు ఏమంత ఆశాజనకంగా లేదు. నిధుల విడుదలలో జాప్యం, నాసిరకంగా పనులుండటం, సిబ్బంది కొరత వగైరాలు ఎన్నోవున్నాయి.ఇక మహిళలకు పంచాయతీరాజ్ వ్యవస్థలో పెద్ద పీట వేయాలని 73వ రాజ్యాంగ సవరణ ప్రతిపాదించింది. అందుకోసం వారికి మూడోవంతు స్థానాలు కేటాయించాలని నిర్దేశించింది. అయితే దీన్ని 50 శాతానికి మార్చాలని మెజారిటీ రాష్ట్రాలు భావించాయి. ఒక లెక్క ప్రకారం 21 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు సగం స్థానాలు మహిళలకు కేటాయించాయి. కానీ విషాదమేమంటే... మహిళల పేరుమీద వారి భర్తలో, తండ్రులో అధికారం వెలగబెడుతున్నారు.ఈ విషయంలో జోక్యం చేసుకుని తగిన చర్య తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టు నిస్సహాయత వ్యక్తం చేసింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఈ సంగతి చూడాలని ఆదేశించింది. అటు తర్వాత ఈ సమస్య పరిష్కారానికి ఒక కమిటీ వేశారుగానీ జరిగిందేమీ లేదు. ప్రజా సేవారంగంలో మహిళలు చొరవగా పాల్గొనటా నికి ఉద్దేశించిన విధానం కాస్తా ఇలా దారితప్పుతోంది.దశాబ్దాల తరబడి పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తూ పోవటంవల్ల పల్లె సీమల్లో వర్ధిల్లాల్సిన ప్రజాస్వామిక వాతావరణం లోపిస్తోంది. తమకున్న వనరులేమిటో, తమ అవ సరాలేమిటో సమీక్షించుకుని ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలో నిర్ణయించుకోవాల్సిన పంచాయతీ రాజ్ సంస్థలు నిధుల కోసం బేలగా ఎదురు చూస్తున్నాయి.పల్లెల్లో సమస్యలన్నీ అపరిష్కృతంగా ఉండిపోవటంవల్ల ఆ సంస్థలపై ప్రజలకు ఒక రకమైన చిన్నచూపు ఏర్పడుతోంది. అందుకే పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించినట్టు పంచాయతీరాజ్ ఎన్నికలు సకాలంలో జరిగేలా చూడాలి. పుదుచ్చేరి మాదిరి నిరవధికంగా వాయిదాలతో పొద్దుపుచ్చుతూ, పంచాయతీలను నామ మాత్రావశిష్టంగా మార్చే ప్రభుత్వాలను దారికి తీసుకొచ్చేందుకు కొత్త మార్గాలు వెదకాలి.

# టైటానియం గుండె వచ్చేసింది..
# 105 రోజులుగా బతుకుతున్న హృద్రోగి

: "ఇనుములో హృదయం మొలిచెలె" అనే సాంగ్ రజనీకాంత్ రోబో మూవీలో ఉంది. వాస్తవానికి ఇనుములో కాదు.. టైటానియంలో హృదయం మొలిచింది. అవును.. టైటానియంతో కృత్రిమ గుండెను తయారు చేశారు. దీనికి బైవకోర్(%దీఱవాజూ=%) అని పేరు పెట్టారు. ఇది కూడా పిడికెడు సైజులోనే ఉంటుంది. ఆస్ట్రేలియాకు చెందిన డేనియల్ టిమ్స్ ఈ టైటానియం గుండెను తయారు చేశారు. ఈ గుండెల తయారీ కోసం ఆయన బైవకోర్ పేరుతో ఒక కంపెనీని ఏర్పాటు చేశారు. దానికి అమెరికాలోని కాలిఫోర్నియా, ఆస్ట్రేలియాలోని సౌత్ పోర్టలలో ఆఫీసులు ఉన్నాయి. డేనియల్ టిమ్స్ తండ్రి ఒక ప్లంబర్. 2001లో టిమ్స్ తండ్రికి గుండె సమస్యలు వచ్చాయి. అప్పటి నుంచే డేనియల్ టిమ్స్ టైటానియం గుండె తయారీపై ఫోకస్ పెట్టారు. తన తండ్రి హార్డ్‌వేర్ స్టోర్‌లోకి వెళ్లి పైపులను, వాల్వ్‌లను జత చేయటంతోనే ఈ పనిని మొదలుపెట్టారు. గుండె రక్త ప్రసరణ వ్యవస్థను అనుకరిస్తూ ఎన్నో డిజైన్లు, ప్రయోగాలు చేశారు. చివరికి ప్రపంచంలోనే తొలి టైటానియం గుండె నమూనాను ఆవిష్కరించారు. దీనితో జంతువులపై ప్రయోగాలు సక్సెస్ అయ్యాయి. దీంతో మనుషులపై టెస్ట్ చేస్తున్నారు. అయితే ఈ గుండె ప్రయోగశాలలో గత నాలుగేళ్లుగా పనిచేస్తూనే ఉండటం విశేషం.

40 ఏళ్ల వ్యక్తి.. 105 రోజులు

ఆస్ట్రేలియాకు చెందిన 40 ఏళ్ల వ్యక్తికి కొన్ని నెలల క్రితం టైటానియం గుండెను(%ఉఞుఅఱబవ ఎముఞ్%) అమర్చారు. దీనితోనే ఆయన గత 105 రోజులుగా జీవిస్తున్నారు. కృత్రిమ గుండెతో ఆస్పత్రి బయట నెలకుపైగా బతికి తొలి వ్యక్తిగా ఈయన రికార్డును క్రియేట్ చేశారు. ఇప్పటివరకు టైటానియం గుండెను




ప్రయోగాత్మకంగా ప్రపంచంలో ఆరుగురికి అమర్చారు. దీన్ని అమర్చుకున్న మరో ఐదుగురు ఆస్పత్రిలో డాక్టర్ల పర్యవేక్షణలో గడిపారు. ఆస్ట్రేలియాకు చెందిన వ్యక్తి మాత్రం టైటానియం గుండెను అమర్చుకున్నాక ఇంటికి వెళ్లిపోయాడు. తన రోజువారీ పనులను హాయిగా చేసుకుంటున్నాడు. ఇటీవలే ఆయనకు ఒక దాత దొరికాడు. దీంతో ఆ దాత అసలు గుండెను తీసి.. ఆయనకు అమర్చారు. లోహపు గుండెను తీసేశారు. టైటానియం గుండెను అమర్చబట్టే.. గుండెను దానం చేసే వ్యక్తి దొరికే వరకు ఆయన బతికారని అంటున్నారు.

టైటానియం గుండె గురించి..

టైటానియం గుండె బైవకోర్ విరిగిపోదు. ఇది స్ట్రాంగ్‌గా ఉంటుంది. ఈ గుండెలోని భాగాలేవీ కదలవు. అయస్కాంత ప్రభావంతో తేలే రోటర్ ఒక్కటే కదులుతుంది. టైటానియం గుండెలోని తేలే రోటర్ ఇతర కఠిన ఉపరితలాలను తాకకుండా, రెండు గదుల మధ్య తిరుగుతూ నిరంతరం, తేలికగా రక్తాన్ని పంప్ చేస్తుంది. ఈ గుండె ఎక్కువ కాలం మన్నుతుంది. ఈ గుండెను వాడే క్రమంలో.. కడుపు భాగంలో అమర్చే బ్యాటరీని మాత్రమే మార్చాలి.టైటానియం గుండె బరువు 650 గ్రాములు. 12 ఏళ్ల పిల్లల ఛాతీలోనూ ఇది ఇమిడిపోతుంది. ఈ గుండెలో స్మార్ట్ కంట్రోలర్ ఉంటుంది. ఇది రోగుల పనులు, శ్రమకు అనుగుణంగా రక్త సరఫరాను కంట్రోల్ చేస్తుంది. టైటానియం గుండెను ఇంకా మార్కెట్లో విక్రయాల కోసం అందుబాటులోకి తేలేదు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 వేల మందికి గుండె మార్పిడి సర్జరీలు అవసరం. అయితే 6వేల కన్నా తక్కువ మందే గుండె మార్పిడి సర్జరీలు చేసుకుంటున్నారు. తీవ్రంగా గుండె దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి టైటానియం గుండె బాగా పనికొస్తుంది.

# అరబ్బుల ఇంటికి.. మన అరటి!

### టన్ను అరటి రూ.20 నుంచి 25 వేలతో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
### హర్షం వ్యక్తం చేస్తున్న అరటి రైతులు


పులివెందులరూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందుల అరటి కాసులు కురిపిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో మంచి డిమాండ్ ఉన్న ఈ అరటి ఇటీవల కాలంలో గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతూ నాణ్యత విషయంలో తగ్గేదే లేదంటోంది. ఈ ప్రాంతంలో సాగయ్యే అరటికి బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వస్తున్నారు. ఢిల్లీ మార్కెట్‌కు ఉనుకూలంగా ఉన్న తోటలును ఎంచుకుని అరటికాయలను కొనుగోలు చేస్తున్నారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ధరలు నిర్ణయించి కొనుగోలు చేయడం ద్వారా దళారుల బెడద లేకుండా పోయిందని రైతన్నలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

#### నియోజకవర్గంలో 10 నుంచి 15వేల ఎకరాల్లో ...

పులివెందుల ననియోజకవర్గ వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో అరటి సాగు ఉంటే ఇందులో 10వేల ఎకరాల్లో గెలలు మొదటి కోతకు రానున్నాయి. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె మండలాల్లో అధికంగానూ, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో తక్కువగా అరటి సాగు అవుతోంది. ఒకసారి సాగు చేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా మే, జూన్, జూలై నెల్లో సాగుచేస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోతకు వచ్చేలా సాగు చేయడం ద్వారా ధరలు ఉంటాయని రైతులు అంటున్నారు.

#### ఎకరాకు రూ.60వేలు పైనే పెట్టుబడులు

అరటి సాగులో పెట్టుబడులు కూడా అధికం అవుతున్నాయి. ఎకరా సాగు చేయాలంటే రూ.60వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అరటి నాటిన మొదలు గెలలు కోతకు వచ్చే వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాగుచేసిన 11 నెలలకు గెలలు కోతకు వస్తాయి. సాగులో పెట్టుబడులు అవుతున్నప్పటికీ ఆదాయం ఉంటుందనే రైతులు



అరటిని సాగుచేస్తున్నారు. డ్రిప్పు ద్వారా నీటి తడులతో పాటు ఎరువులు అందించడం ద్వారా నాణ్యమైన అరటి ఉత్పత్తులు అందుతున్నాయి. సాగులో ఎకరాకు 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడులు వస్తున్నాయి. ఒక్కో గెల 10 నుంచి 12 చీప్‌లు వేస్తుందని రైతులు అంటున్నారు.

#### వారం రోజుల పాటు అరటి కాయల నిల్వ ...

పులివెందుల నుంచి అరటిని ఢిల్లీకి తరలించాలంటే వారంరోజులు పడుతుంది. పక్వానికి వచ్చిన గెలలను కొట్టి చీపులను వేరుచేస్తారు. ఎలాంటి రసాయనాలు వాడుకుండా వారంపాటు నిల్వ ఉండడంతో ఢిల్లీకి చెందిన వ్యాపారులు పులివెందుల అరటి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కోసారి అరటి గెలలను లారీకి లోడ్ చేసి ఢిల్లీకి తరలిస్తారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లేసరికి అరటి గెలలు దెబ్బతినవని, కాయలు నాణ్యతగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

#### అరటికాయలను శుద్ధిచేసి ప్యాకింగ్ ...

పులివెందుల నుంచి అరటి కాయలను ఢిల్లీకి తరలించాలంటే శుద్ధి చేసి ప్యాకింగ్ చేయాల్సి ఉంటుంది. దీంతో తోటల వద్దకు కూలీలు వెళ్లి అరటి గెలలు తీసుకువచ్చి చీపులను వేరుచేస్తారు. వీటిని బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిలో శుద్ధి చేస్తారు. అలా శుద్ధిచేసిన చీపులను అట్టపెట్టెలో కవరు వేసి అందులో అరటి కాయలను ఉంచి ప్యాకింగ్ చేస్తారు. ఒక్కో అట్టపెట్టెలో 15కిలోల చొప్పున అరటికాయలను ప్యాక్ చేస్తారు. తోటల వద్దనే తూకాలు వేసి అట్టపెట్టెలను సీజ్ చేస్తారు. అరటికాయలతో ఉన్న అరటి పెట్టెలను లోడ్ చేసి ఢిల్లీ మార్కెట్‌కు తరలిస్తారు.

#### గల్ఫ్ దేశాలకు పులివెందుల అరటి

పులివెందుల ప్రాంతంలో పండిన అరటికి ఢిల్లీ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎక్కువగా ఈ సీజన్‌లోనే ఇక్కడ అరటి కాయలను తరలిస్తారు. నెలకు 10నుంచి 15వేల టన్నుల మేర కాయలు ఢిల్లీ మార్కెట్‌తో పాటు గల్ఫ్ దేశాలు అరబ్, ఇరాక్, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్తాయి. ఇక్కడ పండించిన అరటి నాణ్యతుగా ఉండడం, వారం రోజుల పాటు నిల్వ ఉండడం వల్ల ఢిల్లీ మార్కెట్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో డిమాండ్ ఉంటుంది. - రామమల్లేశ్వరరెడ్డి, అరటి రైతు

# బట్టమేక.. కష్టాల కేక

### కనుమరుగవుతున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షులు
### దేశవ్యాప్తంగా తగ్గిపోయిన సంఖ్య
### ప్రస్తుతం 150 మాత్రమే ఉన్నట్టు నిర్ధారణ
### నంద్యాల జిల్లా రోళ్లపాడు అభయారణ్యంలోనూ కనిపించని ఉనికి
### గడ్డి భూములు కుచించుకుపోవడంతో చెదిరిపోయిన ఆవాసాలు
### కృత్రిమ గర్భధారణ ద్వారా బట్టమేక సంతతి వృద్ధికి ప్రయత్నాలు

పొడవైన తెల్లటి మెడ.. దాని చుట్టూ తెలుపు-నలుపు ఈకల హారం.. బంగారు/గోధుమ వర్ణపు వీపు.. తలపై నల్లని టోపీతో ఇట్టే ఆకర్షించే రూపం బట్టమేక పక్షుల సొంతం. విమానం మాదిరిగా నేలపై పరుగులు తీసి గాల్లోకి లేచి.. స్థిమితంగా.. లయబద్ధంగా విశాలమైన రెక్కలు కదిలిస్తూ గగన విహారం చేయడం వీటి ప్రత్యేకత.

అమరావతి: అరుదైన బట్టమేక పక్షులు (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) మన దేశంలో అంతరించిపోయే స్థితికి చేరాయి. కొన్నేళ్లుగా చాలాచోట్ల వీటి జాడ కనిపించడం లేదు. 2008లో రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో 300 బట్టమేక పక్షులు ఉండగా.. ప్రస్తుతం వాటిసంఖ్య దేశవ్యాప్తంగా 150కి పడిపోయినట్టు తేలింది. వాటిలోనూ ఎక్కువ పక్షులు రాజస్థాన్‌లోనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 20కిపైగా బట్టమేక పక్షి జాతులు ఉండగా.. మన దేశంలో 4 జాతులున్నాయి. వాటిలో మన రాష్ట్రంలో కనిపించేవి ఇంకా అరుదైన జాతి పక్షులు.

#### మీటరు పొడవు.. 15 కిలోలకు పైగా బరువు

బట్టమేక పక్షుల్లో అత్యంత బలిష్టమైనవి మన ప్రాంతంలోనే ఉండేవి. ఈ పక్షి మీటరు పొడవు, 15 నుండి 20 కిలోల బరువు, పొడవాటి మెడ కలిగి ఉంటుంది. వీటిసంతతి చాలా అరుదుగా వృద్ధి చెందుతూ కేవలం ఏడాదికి ఒక గుడ్డు మాత్రమే పెట్టి దట్టమైన పొదల్లో 27 రోజులపాటు పొదుగుతుంది. దీని జీవిత చక్రం సుమారు 12 ఏళ్లు. ఒక్కో ఆడ పక్షి జీవిత కాలంలో కేవలం ఐదారు గుడ్లు మాత్రమే పెడతాయి. ఏవి దొరికినా తిని కడుపు నింపుకోవడం వీటి ప్రత్యేకత. ధాన్యం గింజలు, పంటల కోత తర్వాత మిగిలిన మోళ్లు, వేళ్లు, పొలాల్లోని మిడతలు, పురుగులు, జెర్రులు, బల్లులు, తొండలు వంటివి వీటి ఆహారం. ఎగిరే పక్షుల్లో రెండవ అతి భారీ పక్షులుగా గుర్తింపు పొందినా.. నివాసానికి అనుకూల వాతావరణం లేక అంతరించిపోతున్నాయి.



#### సంరక్షణ చర్యలున్నా.. ప్రయోజనం సున్నా

మన దేశంలో కనిపించే అత్యంత అరుదైన బట్టమేక పక్షి జాతుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నా ప్రయోజనం కలగడం లేదు. వీటికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రాల్లోనూ వాటి జాడ అరుదుగా మాత్రమే కనిపిస్తోంది. గత ఏడాది కర్ణాటకలోని బళ్లారి సమీపాన సిరిగుప్పలో రెండు, మహారాష్ట్ర లోని బీదర్‌లో ఒకటి కనిపించినట్టు అటవీ శాఖ నిర్ధారించింది. ఆ తర్వాత వీటి జాడ ఎక్కడా కానరాలేదు. మన రాష్ట్రంలోనూ వీటి కోసం నంద్యాల జిల్లా నందికొట్కూరు సమీపంలోని రోళ్లపాడులో 600 హెక్టార్లలో బట్టమేక పక్షుల అభయారణ్యాన్ని ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా అక్కడ కూడా ఈ పక్షులు కనిపించడంలేదు. వేటగాళ్ల ఉచ్చులకు బలైపోవడం, ఆవాసాలు తగ్గిపోవడం, ఎగిరే సమయంలో గాలి మరలు, విద్యుత్ లైన్లకు తగిలి మృత్యువాత పడటం, వాహనాల రణగొణ ధ్వనులే ఇవి అంతరించిపోవడానికి ప్రధాన కారణాలని వన్యప్రాణుల నిపుణులు చెబుతున్నారు.

#### గడ్డి భూములు తగ్గిపోవడంతో..

పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో గడ్డి భూముల పాత్ర కీలకం. బట్టమేకల పక్షుల ఉనికి పర్యావరణానికి మేలు చేసే గడ్డి భూములపైనే ఆధారపడి ఉంది. విశాలమైన గడ్డి మైదానాలే వాటి ఆవాసాలు. అందుకే బట్ట మేక పక్షులను గడ్డి భూముల జీవనాడిగా చెబుతారు. ఈ భూములు పశువులకు మేత అందించడంతోపాటు పశువులపై ఆధారపడి జీవించే జాతుల మనుగడకు ప్రధానమైనవి. వాతావరణంలో ప్రాణవాయువును పెంచేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. తద్వారా పర్యావరణం, జీవ వైవిధ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తాయి. ఆయా ప్రాంతాల్లో నీటి ప్రవాహాన్ని గడ్డి భూములు క్రమబద్ధీకరిస్తాయి. అలాంటి గడ్డి భూములు తగ్గిపోతుండడం బట్టమేక పక్షులు అంతరించి పోతుండటానికి ప్రధాన కారణమైంది. మన దేశంలో 2005 నుంచి 35 శాతం మేర గడ్డి భూములు తగ్గిపోయినట్టు అంచనా. వ్యవసాయ విస్తరణ, పశువుల మేత ఎక్కువవడం, భూముల నిర్వహణ సరిగా లేకపోవడంతో జీవ వైవిధ్యం కోల్పోయి గడ్డి భూములు క్షీణిస్తున్నాయి. గతంలోని గడ్డి భూములు ప్రస్తుతం బంజరు భూములుగా మారిపోయాయి. ఫలితంగా ఆవాసాలు లేక బట్టమేక పక్షులు అంతరించిపోతున్నాయి.

#### కృత్రిమ గర్భధారణపైనే ఆశలు

బట్టమేక పక్షుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ పక్షులను మళ్లీ పునరుద్ధరించే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వాటికోసం సురక్షితమైన గడ్డి మైదానాలను సృష్టించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచిస్తోంది. కృత్రిమ గర్భధారణ ద్వారా బట్టమేక పక్షి పిల్లలను పుట్టించి.. గడ్డి భూముల్లో వదలాలని నిపుణులు సూచిస్తున్నారు. రెండేళ్ల క్రితం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లోని జాతీయ పరిరక్షణ పెంపక కేంద్రం (నేషనల్ కన్జర్వేషన్ బ్రీడింగ్ సెంటర్) కృత్రిమ గర్భధారణ ద్వారా బట్టమేక పక్షుల్ని పునరుద్ధరించింది. వాటిని గడ్డి మైదానాల్లో వదిలి సంరక్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అవి ఎంతమేరకు సఫలీకృతం అవుతాయో వేచి చూడాలి.

## హెడింగ్లీ టెస్టులో భారత్ ఓటమికి

# ఐదు కారణాలు..!






### గిల్ కెప్టెన్సీలో తొలి టెస్టులోనే టీమిండియాకు షాక్

### ఆరంభం అదిరినా.. భారత్ చేజారిన మ్యాచ్

### బ్యాటింగ్ వైఫల్యం, క్యాచ్‌ల డ్రాప్‌లో ఓటమికి ప్రధాన కారణాలు!

### బ్యాటర్లు మెరిసినా.. ఫీల్డింగ్, బౌలింగ్ దెబ్బ



ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా హెడింగ్లీలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో శుభమన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు ఓటమి పాలైంది. ఆరంభం అదిరినప్పటికీ ఆ తర్వాత పట్టు సడలించిన భారత జట్టు అందుకు మూల్యం చెల్లించుకుంది. బ్యాటింగ్ లైనప్ రెండుసార్లు కుప్పకూలడం, కీలకమైన క్యాచ్‌లను జారవిడవడం, బౌలింగ్ విభాగంలో వైవిధ్యం కొరవడటం వంటి అంశాలు భారత్ ఓటమికి ప్రధాన కారణమయ్యాయి. ఈ లోపాలను చక్కగా సద్వినియోగం చేసుకున్న ఇంగ్లాండ్ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. భారత టెస్టు క్రికెట్‌లో మార్పు సంకేతాలు స్పష్టంగా కనిపించాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు లేని యువ ఆటగాళ్లతో కూడిన జట్టుకు శుభ్‌మన్ గిల్ సారథ్యం వహించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు సాధించడంతో భారత్ 471 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించినట్లేనని అందరూ భావించారు. అయితే, ఆ తర్వాత వరుస వైఫల్యాలు జట్టును దెబ్బతీశాయి. పదేపదే బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలడం, ఫీల్డింగ్‌లో తప్పిదాలు, చివరి ఇన్నింగ్స్‌లో బౌలర్లు తేలిపోవడంతో ఇంగ్లాండ్ జట్టు 371 పరుగుల భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించి విజయాన్ని అందుకుంది.

బ్యాటింగ్ వైఫల్యాలు

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ సెంచరీలతో చెలరేగడంతో ఒక దశలో 430/3 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే, ఆ తర్వాత కేవలం 41 పరుగుల వ్యవధిలో చివరి ఏడు వికెట్లను కోల్పోయింది. 600 పరుగులు దాటుతుందని భావించిన స్కోరు 471 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇదే కథ పునరావృతమైంది. రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ రాణించడంతో 333/5 స్కోరుతో మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ, మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. దీంతో మరోసారి కుప్పకూలిన భారత్, అదనంగా 77 పరుగులు మాత్రమే జోడించి 364 పరుగులకు ఆలౌటైంది. అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్, చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. టాప్ ఆర్డర్, మిడిలార్డర్ మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది.

కీలక సమయాల్లో ఫీల్డింగ్ తప్పిదాలు

రెండు ఇన్నింగ్స్‌లలోనూ భారత ఫీల్డింగ్ పేలవంగా ఉంది. ముఖ్యంగా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ నాలుగు కీలక క్యాచ్‌లను జారవిడిచాడు. బెన్ డకెట్ 97 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన సులువైన క్యాచ్‌ను జైస్వాల్ వదిలేయడం మ్యాచ్‌ను మలుపుతిప్పింది. ఆ తర్వాత డకెట్ 149 పరుగులు చేసి ఇంగ్లండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రతీ క్యాచ్ డ్రాప్ తర్వాత భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నట్లు స్పష్టంగా కనిపించింది. కేవలం జైస్వాల్ మాత్రమే కాకుండా, స్లిప్‌లోనూ క్యాచ్‌లు నేలపాలయ్యాయి. అవుట్ ఫీల్డర్లు బంతిని అంచనా వేయడంలో తడబడ్డారు. వికెట్ కీపర్ రిషబ్ పంత్ కూడా కీలక సమయాల్లో వికెట్ల వెనుక తేలిపోయాడు. ఐదో రోజు పిచ్‌పై ప్రతీ పరుగూ కీలకమైన తరుణంలో ఇటువంటి తప్పిదాలు ఇంగ్లాండ్ కు అనేక లైఫ్‌లైన్‌లు ఇచ్చాయి.

ప్రభావం చూపని బౌలింగ్ కూర్పు

బుమ్రా, సిరాజ్, శార్దూల్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ, జడేజాలతో కూడిన భారత బౌలింగ్ యూనిట్ కీలక సమయంలో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టడంలో విఫలమైంది. బౌలింగ్ కూర్పులో సమతుల్యత లోపించింది. తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా ఐదు వికెట్లు పడగొట్టినప్పటికీ, రెండో ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. సిరాజ్ కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అర్ష్‌దీప్ సింగ్ వంటి అదనపు పేస్ బౌలర్ లేదా దూకుడైన రిస్ట్ స్పిన్నర్‌ను తీసుకోకపోవడం బౌలింగ్ విభాగాన్ని బలహీనపరిచింది. బ్యాటింగ్‌లో ఉపయోగపడతాడనే ఉద్దేశంతో జట్టులోకి తీసుకున్న శార్దూల్ రెండో ఇన్నింగ్స్‌లో కొన్ని పరుగులు చేసినప్పటికీ, బౌలింగ్‌లో తేలిపోయాడు. దీంతో అతని ఎంపికపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రసిద్ధ్ కృష్ణ పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. జడేజా, స్టోక్స్ వికెట్ పడగొట్టినప్పటికీ, ప్రత్యర్థి బ్యాటర్లను నిలకడగా కట్టడి చేయడంలో గానీ, భయపెట్టడంలో గానీ విఫలమయ్యాడు.

జస్ప్రీత్ బుమ్రాపై అతిగా ఆధారపడటం

జస్ప్రీత్ బుమ్రా ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపిస్తాడనే నమ్మకం ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. రివర్స్ స్వింగ్, వేగం, కచ్చితత్వంతో కూడిన అతని బౌలింగ్ ప్రత్యర్థిని వణికించింది. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌కు వికెట్లు అత్యవసరమైనప్పుడు తేలిపోయాడు. అతడి బౌలింగ్‌ను డకెట్, జాక్ క్రాలీ సమర్థంగా ఎదుర్కొన్నారు. దీంతో బుమ్రా రాణిస్తే భారత్ పోటీలో ఉంటుంది, లేకపోతే త్వరగా చేతులెత్తేస్తోందన్న వాదనకు మరోమారు బలం చేకూరింది.


ఇంగ్లాండ్ మెరుగైన, తెలివైన ఆటతీరు

భారత్‌కు కొన్ని అవకాశాలు లభించినప్పటికీ ఇంగ్లాండ్ ఎప్పుడూ నమ్మకాన్ని కోల్పోలేదు. వారి ఆటతీరు ప్రశాంతంగా, వ్యూహాత్మకంగా, నిర్భయంగా సాగింది. వారు తొందరపడలేదు, అలాగని అతిజాగ్రత్తకూ పోలేదు. డకెట్ 149 పరుగులు, తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన క్రాలీ రెండో ఇన్నింగ్స్‌లో 65 పరుగులతో రాణించడం ఇంగ్లాండ్ విజయానికి పునాది వేశాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఓలీ పోప్ సెంచరీ, హ్యారీ బ్రూక్ సెంచరీకి చేరువ కావడంతో భారత్ 471 పరుగులకు సమానంగా 465 పరుగులు చేసింది. ఐదో రోజు 371 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ ఉదయం సెషన్‌లో అద్భుతమైన క్రమశిక్షణతో బ్యాటింగ్ చేసి, ఒత్తిడిని అధిగమించింది. ఆ తర్వాత అవసరమైనప్పుడు వేగం పెంచింది. ఎప్పుడు దాడి చేయాలో, ఎప్పుడు నిలకడగా ఆడాలో వారి ప్రణాళిక భారత బౌలర్లను అధిగమించింది.

శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత యువ జట్టు, ముఖ్యంగా టాప్ ఆర్డర్ బ్యాటింగ్‌లో ఆశాజనకంగా కనిపించినప్పటికీ, తక్షణమే దృష్టి సారించాల్సిన కొన్ని బలహీనతలు ఈ మ్యాచ్ ద్వారా వెలుగులోకి వచ్చాయి. మిడిలార్డర్ సమస్యలను పరిష్కరించడం, ఫీల్డింగ్ ప్రమాణాలను మెరుగుపరచడం, లేదా ఒకే బౌలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడం వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఈ ఓటమి భవిష్యత్తు ప్రణాళికలకు ఒక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది.

## ముంబై ఎయిర్‌పోర్ట్ కోసం

# అదానీ నిధుల సమీకరణ



న్యూఢిల్లీ: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల నుంచి డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ బిలియన్ డాలర్లు (సుమారు రూ. 8,600 కోట్లు) సమీకరించింది. నిధులను ముంబై ఎయిర్‌పోర్ట్ రుణాల రీఫైనాన్సింగ్‌కు వినియోగించనుంది. న్యూయార్క్ సంస్థ అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షతన మెట్‌లైఫ్ ఇంక్, బ్లాక్‌రాక్ ఇంక్, ఎఫ్‌డబ్ల్యూడీ ఇన్సూరెన్స్ నిధులు సమకూర్చాయి. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(ఎంఐఏఎల్) కోసం 2022లో సమీకరించిన రుణాల రీఫైనాన్స్‌కు నిధులు వెచ్చించనున్నట్లు అదానీ గ్రూప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. ఎంఐఏఎల్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ వాటా 74 శాతంకాగా.. భారత ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి 26 శాతం వాటా ఉంది. దేశీయంగా రెండో పెద్ద ఎయిర్‌పోర్ట్‌ను నిర్వహిస్తున్న కంపెనీ 2029 జులైలో గడువుతీరే 75 కోట్ల డాలర్ల విలువైన నోట్లను జారీ చేసింది. వీటికి అదనంగా 25 కోట్ల డాలర్ల నోట్లను జారీ చేసే వీలుతో నిధుల సమీకరణ చేపట్టింది. తద్వారా బిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. దీంతో ఎంఐఏఎల్ అభివృద్ధి, ఆధునీకరణ, సామర్థ్య విస్తరణకు ఆర్థిక వెసులుబాటు లభించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలియజేసింది. తాజాగా జారీ చేసిన బాండ్లు 6.9 శాతం కూపన్‌రేటుతో నాలుగేళ్ల కాలానికి గడువు తీరనున్నాయి. ఎయిర్‌పోర్ట్ మౌలికసదుపాయాల రంగంలో తొలి ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ప్రయివేట్ బాండ్ల జారీని చేపట్టినట్లు కంపెనీ పేర్కొంది.

# అంతరిక్షంలోకి... తెలుగమ్మాయి!




**' అమ్మమ్మా... ఆ చంద్రుడేంటి నేనెక్కడికి వెళ్తే అక్కడికి వస్తున్నాడు?' 'నిన్ను తన దగ్గరికి రా రమ్మని పిలుస్తున్నాడు లేమ్మా' చిన్నారి అడిగిన ప్రశ్నకు బామ్మ ఇలా సరదాగా సమాధానమిచ్చింది. కానీ ఆ పాప మాత్రం దాన్ని సరదాగా తీసుకోలేదు.**

' అమ్మమ్మా... ఆ చంద్రుడేంటి నేనెక్కడికి వెళ్తే అక్కడికి వస్తున్నాడు?' 'నిన్ను తన దగ్గరికి రా రమ్మని పిలుస్తున్నాడు లేమ్మా' చిన్నారి అడిగిన ప్రశ్నకు బామ్మ ఇలా సరదాగా సమాధానమిచ్చింది. కానీ ఆ పాప మాత్రం దాన్ని సరదాగా తీసుకోలేదు. అంతరిక్షంలోకి అడుగుపెట్టాలి, చుక్కల అంచులను తాకాలి అనుకుంది. అనుకున్నట్టుగానే కల నిజం చేసుకుంటోంది. జాహ్నవి దంగేటి... తాజాగా అంతరిక్ష యాత్ర చేసే అవకాశాన్ని దక్కించుకుందీ తెలుగమ్మాయి. 'అమ్మమ్మ మాట, తను చెప్పే చంద్రుడు- పేదరాసి పెద్దమ్మ కథల పుణ్యమాని చంద్రుడిపై ఆసక్తి కలిగింది. అక్కడికి వెళ్లి, పేదరాసి పెద్దమ్మ ఇచ్చే బహుమతులు తెచ్చుకోవాలి అనుకునేదాన్ని. పెద్దయ్యాక ఏమవుతావని ఎవరడిగినా చంద్రుడి మీదకు వెళ్తాననేదాన్ని. ఒక పెద్ద నిచ్చెనతో ఎక్కేస్తా అనీ చెప్పేదాన్ని. అలాంటి నాకు 11 ఏళ్ల వయసులో నాసా పరిచయమైంది' అని గుర్తు చేసుకుంటుంది జాహ్నవి. ఈమెది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు. అమ్మానాన్నలు శ్రీనివాస్, పద్మశ్రీ.

ఆస్ట్రోనాట్ అవ్వాలన్న లక్ష్యం ఏర్పడ్డాక దాని గురించి సమాచారం సేకరించడం మొదలుపెట్టింది జాహ్నవి. 16 ఏళ్ల వయసులో 'ఇస్రో వరల్డ్ స్పేస్ వీక్'లో పాల్గొంది. అక్కడ ఎంపికైన 2000 ప్రాజెక్టుల్లో తనదీ ఒకటి. అలా తన కల దిశగా ప్రయాణం ప్రారంభించింది. ఆస్ట్రోనాట్‌లకు అవసరమని స్కూబా డైవింగ్‌నీ ప్రయత్నించిందంటే తన పట్టుదలేంటో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, దేశంలోనే పిన్న అడ్వాన్స్‌డ్ స్కూబా డైవర్‌గానూ నిలిచింది. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చదివింది జాహ్నవి. బీటెక్ చేస్తున్నప్పుడే నాసా పదిరోజుల ప్రోగ్రామ్‌కి ఎంపికైంది. ఆ అవకాశం అందుకున్న తొలి భారతీయురాలు. మిషన్ డైరెక్టర్‌గా మినీ రాకెట్, అండర్ వాటర్ రాకెట్ లాంచ్‌ల్లో భాగమైంది. ఆ అనుభవం 2022లో పోలాండ్‌లో లూనార్ మిషన్‌లో పాల్గొనే అవకాశాన్ని ఇచ్చింది. 'అక్కడ అచ్చం చంద్రుడిపై ఉండే వాతావరణమే ఉంటుంది. కాకపోతే మానవ నిర్మితం. 12 రోజులపాటు ఆ వాతావరణంలో గడిపా. అయిదేళ్లనాటి నా కల ఆనాడు అలా నిజమైంది' అంటుంది జాహ్నవి. అతిపిన్న అనలాగ్ ఆస్ట్రోనాట్‌గా గుర్తింపు పొందిన జాహ్నవి... ఐస్‌లాండ్‌లో జరిపే జియాలజీ శిక్షణకు ఎంపికైన తొలి భారతీయురాలు కూడా.

రెండు సూర్యోదయాలు, రెండు సూర్యాస్తమయాలు

2023... ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆస్ట్రోనాటికల్ సైన్స్‌లో చేరే అవకాశం వచ్చింది. ఇదివరకే ఒకసారి తిరస్కరణకు గురైన జాహ్నవికి అది గొప్ప అవకాశమే. అక్కడ సిమ్యులేషన్స్, ఫ్లైట్ ఎక్సర్‌సైజెస్, మిషన్ డ్రిల్స్... వంటి ఎన్నో అంశాల్లో నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంది. తాజాగా అంతరిక్షంలోకి అడుగుపెట్టే అవకాశాన్నీ అందుకుంది. అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ 'టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్' చేపట్టిన 'టైటాన్ స్పేస్ మిషన్'కి ఆస్ట్రోనాట్ క్యాండిడేట్‌గా జాహ్నవి ఎంపికైంది. దీనికోసం మూడేళ్లపాటు వ్యోమగామి శిక్షణలో పాల్గొంటుంది. ఫ్లైట్ సిమ్యులేషన్, స్పేస్‌క్రాఫ్ట్ ప్రొసీజర్లు, సర్వైవల్ ట్రైనింగ్, మెడికల్, సైకలాజికల్ అసెస్‌మెంట్లు ఇందులో భాగంగా ఉంటాయి. ఇది పూర్తయిన అనంతరం 2029లో 5గం.పాటు ఆర్బిటర్ స్పేస్ ఫ్లైట్‌లో ప్రయాణించనుంది. 'మానవ అంతరిక్ష ప్రయాణంలో ఇది ముందడుగు. ఈ ప్రయాణంలో రెండు చొప్పున సూర్యోదయాలు, సూర్యాస్తమయాలను గమనించనున్నాం. ఈ అవకాశం అందుకోవడం గొప్పగా భావిస్తున్నా' అంటోన్న జాహ్నవి తన ప్రయాణంలో ఎన్నో గుర్తింపులూ, అవార్డులూ అందుకుంది. అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో రికార్డులూ సృష్టించింది. అలాగని తన ప్రయాణమేమీ సులభం కాదు. 'అమ్మాయిలకు సులువు కాద'న్న మాటలు, రోజులపాటు శిక్షణలో భాగంగా ప్రపంచానికి, అయినవాళ్లకు దూరంగా ఉండాలి, సరైన ఆహారమూ ఉండదు. కానీ ఇవన్నీ కలల సాధనలో మామూలే అనుకుంటూ సాగింది జాహ్నవి.




అంతేకాదు, 'పట్టుదల ఉండాలే కానీ ఏదీ అసాధ్యం కాద'ని యువతలో స్ఫూర్తినీ నింపుతోందీ 23 ఏళ్ల అమ్మాయి. అంగారకుడిపై అడుగుపెట్టాలి, భవిష్యత్ అంతరిక్ష ప్రోగ్రాముల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించాలన్నవి తన లక్ష్యాలు. ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా మరి!

# 1975: 50 ఏళ్ల కిందట జూన్ 25ఎమర్జెన్సీకి దారితీసిన ఐదు ప్రధాన సంఘటనలు ఇవే..!

### గుజరాత్‌లో ఫీజుల పెంపుతో మొదలైన విద్యార్థుల ఆందోళన

### బీహార్‌లో జేపీ నేతృత్వంలో "సంపూర్ణ క్రాంతి" ఉద్యమం

### జార్జ్ ఫెర్నాండెజ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త రైల్వే సమ్మె

### ఎన్నికల మోసం కేసులో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా కోర్టు తీర్పు

### ప్రతిపక్షాల భారీ ర్యాలీతో ఇందిర ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటన



ఢిల్లీ: భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరపురాని వివాదాస్పద ఘట్టమైన ఎమర్జెన్సీ విధించి నేటికి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తవుతోంది. 1975 జూన్ 25వ తేదీ రాత్రి అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించింది. అయితే, ఎమర్జెన్సీ విధింపునకు దారితీసిన పరిస్థితులు ఒక్కరోజులో ఏర్పడినవి కావు. కొన్ని నెలల పాటు దేశ రాజకీయాల్లో చోటుచేసుకున్న ఐదు ప్రధాన సంఘటనలు ఈ తీవ్ర నిర్ణయానికి కారణమయ్యాయి. ఆ కీలక పరిణామాలను ఓసారి పరిశీలిద్దాం.

గుజరాత్ ఆందోళనలు

1973లో గుజరాత్‌లో హాస్టల్ ఫీజుల పెంపునకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రారంభించిన నిరసనలు రాష్ట్రవ్యాప్తంగా ఉధృతరూపం దాల్చాయి. అప్పటి ముఖ్యమంత్రి చిమన్‌భాయ్ పటేల్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆయన్ను "చిమన్ చోర్" (చిమన్ దొంగ) అంటూ ప్రజలు నినాదాలు చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో 1974 ఫిబ్రవరిలో ఇందిరా గాంధీ ప్రభుత్వం చిమన్‌భాయ్ పటేల్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించింది. ఈ ఘటన కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకతకు బీజం వేసింది.

బీహార్‌లో జేపీ ఉద్యమం

గుజరాత్ పరిణామాల స్ఫూర్తితో, బీహార్‌లోనూ అప్పటి ముఖ్యమంత్రి అబ్దుల్ గఫూర్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించారు. గాంధేయవాది, ప్రముఖ నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) ఈ ఉద్యమంలో పాలుపంచుకోవడంతో దీనికి మరింత బలం చేకూరింది. ప్రస్తుతం బీహార్ లో కీలక నేతలు లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్ వంటి వారు కూడా ఈ ఉద్యమం నుంచే వెలుగులోకి వచ్చారు. జేపీ "సంపూర్ణ క్రాంతి" (సంపూర్ణ విప్లవం)కి పిలుపునిస్తూ, ప్రధాని పీఠం నుంచి ఇందిరా గాంధీ దిగిపోవాలని డిమాండ్ చేశారు. ఇది దేశవ్యాప్తంగా ఇందిర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన గళం వినిపించడానికి దోహదపడింది.

జార్జ్ ఫెర్నాండెజ్ నేతృత్వంలో రైల్వే సమ్మె

1974లో కార్మిక సంఘ నాయకుడు జార్జ్ ఫెర్నాండెజ్ ఆధ్వర్యంలో జరిగిన రైల్వే సమ్మె దేశ రవాణా వ్యవస్థను స్తంభింపజేసింది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఇది తీవ్ర ప్రభావం చూపింది. ఇదే సమయంలో, రైల్వే మంత్రి, బీహార్ ఎంపీ అయిన ఎల్.ఎన్. మిశ్రా ఒక బాంబు దాడిలో మరణించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ సమ్మె, మిశ్రా హత్య ప్రభుత్వానికి తీవ్ర సవాలుగా మారాయి.

ఇందిరా గాంధీపై కోర్టు కేసు


1971 ఎన్నికల్లో ఇందిరా గాంధీ మోసానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సోషలిస్ట్ నాయకుడు రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపింది. 1975 జూన్ 12న జస్టిస్ జగన్ మోహన్‌లాల్ సిన్హా ఇందిరా గాంధీని దోషిగా తేల్చుతూ, ఆమె ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చారు. అదేరోజు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలై, ఐదు ప్రతిపక్ష పార్టీల కూటమి విజయం సాధించడం గమనార్హం. జూన్ 24న సుప్రీంకోర్టు ఈ తీర్పుపై షరతులతో కూడిన స్టే ఇచ్చింది. ఇందిరా గాంధీ ప్రధానిగా కొనసాగవచ్చని, అయితే పార్లమెంటులో ఓటు వేసే హక్కు ఉండదని స్పష్టం చేసింది.

ఎమర్జెన్సీ ప్రకటన

కోర్టు తీర్పు, ప్రతిపక్షాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో 1975 జూన్ 25న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ దేశాయ్ తదితర ప్రతిపక్ష నాయకులు భారీ బహిరంగ సభ నిర్వహించారు. "రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలను" పాటించవద్దని వారు పోలీసులను, సైన్యాన్ని కోరారు. "ఆ మహిళ (ఇందిరా గాంధీ) మా ఉద్యమం ముందు నిలబడలేదు" అని మొరార్జీ దేశాయ్ ఆ సభలో ప్రకటించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో, అదే రోజు రాత్రి ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించాలని నిర్ణయించారు. జూన్ 26వ తేదీ తెల్లవారుజామున రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ సంతకంతో దేశంలో ఎమర్జెన్సీ అధికారికంగా అమల్లోకి వచ్చింది. పౌర హక్కులు సస్పెండ్ చేశారు, ప్రతిపక్ష నేతలను అరెస్టు చేశారు, పత్రికలపై సెన్సార్‌షిప్ విధించారు. ఈ ఎమర్జెన్సీ సుమారు 21 నెలల పాటు కొనసాగి, భారత రాజకీయాలపై చెరగని ముద్ర వేసింది.

# ఎన్టీఆర్ 'వార్-2'.. ఇంకెప్పుడు సారూ?





టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ ఇప్పుడు బాలీవుడ్ డెబ్యూకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. బీ టౌన్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి వార్-2 మూవీలో లీడ్ రోల్ పోషిస్తున్నారు. స్టార్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్న ఆ సినిమాను బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అయాన్ ముఖర్జీ గ్రాండ్ గా తెరకెక్కిస్తున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ లో భాగంగా రూపొందుతున్న వార్-2ను ఆగస్టు 14వ తేదీన విడుదల చేస్తామని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతుండగా.. ఇంకాస్త షూటింగ్ పెండింగ్ ఉందని టాక్ వినిపిస్తోంది. కొన్ని సీన్స్ ను ఇప్పుడు మేకర్స్ షూట్ చేస్తున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హృతిక్- తారక్ తో ఓ సాంగ్ ను చిత్రీకరించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. ఆ సాంగ్ తో సినిమాకు వావ్ ఫ్యాక్టర్ ను యాడ్ చేయాలని మేకర్స్ చూస్తున్నారట. జులై ఫస్ట్ వీక్ లో చిత్రీకరించనున్నారని సమాచారం. ఇప్పటికే టీజర్ ను రిలీజ్ చేయగా.. అనుకున్నంత స్థాయిలో ఆడియన్స్ అండ్ ఫ్యాన్స్ నుంచి రెస్పాన్స్ రాలేదని చెప్పాలి. హై ఎండ్ యాక్షన్ అండ్ విజువల్స్ ఉన్నప్పటికీ.. తెలుగులో బజ్ ఎక్కువగా క్రియేట్ అవ్వలేదు. దీంతో సినిమాను ఫుల్ గా ప్రమోట్ చేయాల్సి ఉంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో వార్ -2 మూవీకి ఏకైక ఆకర్షణ జూనియర్ ఎన్టీఆర్. అందుకే దక్షిణాది వ్యూహాన్ని త్వరగా మేకర్స్ అమలు చేయాలి. సినిమాను ఫుల్ గా ప్రమోట్ చేయాలి. ఎందుకంటే డైరెక్టర్ కు నార్త్ లో ఉన్నంత బ్రాండ్ వాల్యూ సౌత్ లో ఉండదు. కాబట్టి ఎన్టీఆరే మెయిన్ పిల్లర్ గా మూవీని ప్రమోట్ చేయాల్సిన అవసరం ఉంది. ఇంకా రిలీజ్ కు నెల పైన ఉంది. అందుకే ప్రమోషన్స్ లో వేగం పెంచాలి. తెలుగు ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ చేయకపోతే.. మార్కెట్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అదే సమయంలో వార్-2 మూవీ రిలీజ్ అయ్యే రోజు కూలీ మూవీ కూడా సందడి చేయనుంది. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్, స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబోలో రూపొందుతున్న ఆ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మూవీ కచ్చితంగా హిట్ అవుతుందనే ధీమాను మేకర్స్ ప్రమషన్స్ తో క్రియేట్ చేశారు. కాబట్టి వార్-2 మేకర్స్ కూడా సందడి చేయాల్సిందే. ఇంకెప్పుడూ సారూ అంటూ నెటిజన్లు అడుగుతున్నారు.




# వరుస ఆఫర్లతో ఎక్కడా తగ్గట్లేదుగా



సినీ ఇండస్ట్రీలో ఎవరికెప్పుడు అదృష్టం కలిసొస్తుందో ఎవరూ చెప్పలేం. అందుకే ఇండస్ట్రీలో ప్రతీ వారం స్టార్లు మారుతూ ఉంటారని. ఒక వారం ఒకరు విన్నర్ అయి స్టార్ గా నిలిస్తే, ఇంకోవారం ఇంకొకరు స్టార్ అవుతారు. ఎవరెప్పుడు, ఎలా స్టార్లుగా మారతారనేది ఎవరూ ఊహించలేం. అలా ప్రేమలు సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది ఆ సినిమాలో నటించిన మమిత బైజు. ప్రేమలు సినిమా తర్వాత మమిత క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఆ సినిమా కంటే ముందు మమిత మలయాళంలో పలు సినిమాలు చేసినప్పటికీ వాటన్నింటితో రాని క్రేజ్ ప్రేమలు సినిమాతో వచ్చింది. కేవలం మలయాళంలో కాకుండా ఆ సినిమా రిలీజైన ప్రతీ భాషలోనూ అమ్మడికి ఫ్యాన్స్ ఏర్పడ్డారు. అందులో భాగంగానే మమితకు ఆఫర్లు క్యూ కడుతున్నాయి. అమ్మడు కూడా క్రేజ్ ఉన్నప్పుడే వరుస పెట్టి సినిమాలు చేయాలనే ఉద్దేశంతో తనకు వచ్చిన ఆఫర్లలో ది బెస్ట్ సెలెక్ట్ చేసుకుంటూ కెరీర్లో ముందుకు దూసుకెళ్తుంది. ప్రేమలు సినిమా మమిత కెరీర్ ను ఎంతగా మార్చిందంటే ఆ సినిమా తర్వాత ఏకంగా తనకు సూర్య, విజయ్ లాంటి హీరోలతో నటించే ఛాన్సులు తెచ్చి పెట్టేంత. విజయ్ నటిస్తున్న ఆఖరి సినిమా జన నాయగన్ లో మమిత కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వస్తోన్న సూర్య46లో ఏకంగా సూర్య సరసన నటిస్తోంది. వీటితో పాటూ ప్రదీప్ రంగనాథన్ తో కలిసి డ్యూడ్ సినిమా చేస్తోంది. ఆల్రెడీ చేస్తున్న ఇరండు వానం రిలీజ్ కు రెడీ అయింది. ఇక రీసెంట్ గా ప్రేమలు సినిమాలో అమూల్ డెవిస్ పాత్రలో కనిపించిన సంగీత్ ప్రతాప్ తో కలిసి ఓ సినిమా చేయడానికి మమిత గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది మమిత. ఈ సినిమా పూర్తి స్థాయి ప్రేమ కథా చిత్రంగా రాబోతుంది. ప్రేమలు తర్వాత మలయాళ, తమిళ సినిమాల్లో బాగా బిజీగా మారిన మమిత, సూర్య46 తర్వాత తెలుగు లో కూడా బిజీ అయ్యే అవకాశాలున్నాయి.

## మూడు వారాల ముందుగానే

# పవన్ వీరమల్లు..!







పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందిన 'హరి హర వీరమల్లు' ఈ నెలలో విడుదల కావాల్సి ఉండగా వీఎఫ్ఎక్స్ ఆలస్యం కావడంతో వాయిదా వేసిన విషయం తెల్సిందే. జులై మొదటి వారంలో విడుదల చేయాలని నిర్మాణ సంస్థ భావించినా కూడా అమెజాన్‌ప్రైమ్‌తో ఉన్న ఒప్పందం కారణంగా జులై చివరికి వాయిదా వేశారు. ఇటీవల నిర్మాణ సంస్థ హరి హర వీరమల్లు సినిమాను జులై 24కి ఖరారు చేయడం జరిగింది. ఆ విషయం గురించి అధికారికంగా ప్రకటన విడుదలైంది. జులై 24న రాబోతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సాధారణంగా సినిమా విడుదలకు వారం లేదా రెండు వారాల ముందు ట్రైలర్‌లను విడుదల చేస్తారు. కానీ ఈ సినిమా ట్రైలర్‌ను మూడు వారాల ముందు విడుదల చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారు. చిత్ర యూనిట్ సభ్యుల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం హరిహర వీరమల్లు సినిమా ట్రైలర్‌ను ఈ నెల చివర్లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఇంతకు ముందే ట్రైలర్ కట్ పూర్తి అయింది. విడుదల తేదీ వాయిదా పడటంతో ట్రైలర్ విడుదలను ఆపేసిన విషయం తెల్సిందే. ఎలాగూ ట్రైలర్ రెడీగా ఉంది, కనుక వెంటనే విడుదల చేస్తే ఒక పనైపోతుంది కదా అనే సభ్యులు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పైగా సినిమా ట్రైలర్‌ను వదిలితే సినిమాపై అంచనాలు రోజు రోజుకు పెరుగుతాయి. అందుకే వీరమల్లు ట్రైలర్‌ను మూడు వారాల ముందుగానే థియేటర్‌ల ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. జులై మొదటి వారంలో విడుదల కాబోతున్న ఒక పెద్ద సినిమాతో వీరమల్లు సినిమా ట్రైలర్‌ను థియేటర్‌లలో స్క్రీనింగ్ చేసేందుకు నిర్మాణ సంస్థ ప్రయత్నాలు చేసిందని తెలుస్తోంది. అతి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. ట్రైలర్ విడుదల తర్వాత సినిమా స్థాయి కచ్చితంగా పెరుగుతుందనే విశ్వాసంను మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాను క్రిష్ దర్శకత్వంలో మొదలు పెట్టారు. చాలా ఆలస్యం కావడంతో సినిమా దర్శకత్వ బాధ్యతలను నిర్మాత ఏ ఎం రత్నం తనయుడు జ్యోతి కృష్ణ తీసుకున్నాడు. ఆయన ఈ సినిమాను ఫినిష్ చేశాడు. ఈ సినిమా యొక్క బడ్జెట్ భారీగా పెరిగింది. అందుకు తగ్గట్లుగానే ఈ సినిమా గ్రాండ్‌గా ఉంటుందని దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్‌కి జోడీగా నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించింది. బాలీవుడ్ స్టార్ ఈ సినిమాలో ముఖ్య పాత్రలో కనిపించబోతున్నాడు. కీరవాణి అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది అనే విశ్వాసంను మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దర్శకుడు జ్యోతికృష్ణ సినిమా ప్రమోషన్‌ను మొదలు పెట్టాడు. తెలుగులో ఈ సినిమాను భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. అంతే కాకుండా తమిళనాట ఈ సినిమా ను పెద్ద ఎత్తున విడుదల చేయాలని భావిస్తున్నారు. ఈ సినిమా తర్వాత పవన్ కళ్యాణ్ నుంచి ఓజీ సినిమా రాబోతున్న విషయం తెల్సిందే. ఆ సినిమా ప్రమోషన్స్ ఆగస్టు లో షురూ కానున్నాయి. ఆగస్టులోనే ఓజీ ట్రైలర్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# చిరు-నాగ్‌తో మల్టీస్టారర్..

## ఇలా మిస్ అయింది!



టాలీవుడ్ సీనియర్ హీరోలు చిరంజీవి ఎంత మంచి స్నేహితులో అందరికి తెలిసిందే. ఇరు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పండుగ సమయంలో లేదా ఏదైనా శుభకార్యం జరిగితే ఫ్యామిలీతో కలిసి హాజరవుతుంటారు. కెరీర్ పరంగానే కాకుండా వ్యాపార పరంగానూ ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. అంతా క్లోజ్‌గా ఉండే ఈ ఇద్దరు..ఇప్పటి వరకు కలిసి నటించకపోవడం గమనార్హం. వీరిద్దరి కలయికలో ఓ సినిమా వస్తే బాగుటుందని అటు అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు ఇటు మెగా అభిమానులు కూడా కోరుకుంటున్నారు. అయితే గతంలోనే వీరిద్దరు కలిసి ఓ సినిమా చేయాల్సింది. కానీ చివరి నిమిషంలో అది ఆగిపోయిందట. ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ..చిరు, నాగ్‌లతో ఓ సినిమా ప్లాన్ చేశాడట. వీరిద్దరికి ఉన్న స్టార్ ఇమేజ్ దృష్ట్యా.. భారీ బడ్జెట్‌తో సినిమాను తీయాలని భావించాడట. అయితే దానికి తగ్గట్టుగా కథ సెట్ కాకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత కూడా పలువురు దర్శకుడు వీరిద్దరితో సినిమా చేసేందుకు ప్లాన్ చేశారు.అయితే సరైన కథ దొరకపోవడంతో చిరంజీవి, నాగార్జున ఇప్పటివరకు కలిసి నటించలేదు. ఆ మధ్య అనిల్ రావిపూడి కూడా వీరిద్దరితో కలిసి సినిమా చేస్తాడనే రూమర్ వినిపించింది. చిరంజీవితో తీయబోయే సినిమాలో నాగార్జున కూడా నటిస్తాడని వార్తలు వచ్చాయి. కానీ అదంతా ఒట్టి పుకారే అని తేలిపోయింది. సరైన కథ రావాలే కానీ కలిసి నటించడానికి తాము రెడీ అని చిరు, నాగ్ ఎప్పటి నుంచో చెబుతున్నారు. కానీ మన దర్శక-రచయితలే వారిని మెప్పించే కథలను సిద్ధం చేయడం లేదు. మరి వారిద్దరు మెచ్చే కథ ఏ దర్శకుడు తీసుకొస్తాడో..అసలు చిరు-నాగ్ కాంబినేషన్‌లో సినిమా వస్తుందో రాదో చూడాలి.

# మరోసారి సెంచరీ కొట్టేసిన ధనుష్




మెల్లగా తన మార్కెట్‌ను బలోపేతం చేసుకుంటున్న తమిళ స్టార్ హీరో ధనుష్‌కు 'కుబేర' సినిమా మరో పెద్ద విజయాన్ని అందించింది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా, విడుదలైన తొలి రోజు నుంచే మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. నాగార్జున, రష్మిక మందన్నా వంటి స్టార్ కాస్ట్, ధనుష్ ఆకట్టుకునే నటన కలిసి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలిపాయి. లేటెస్ట్ గా 'కుబేర' సినిమా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను దాటి గణనీయమైన ఘనత సాధించిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇది విడుదలైన 6 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం విశేషం. సినిమాపై ముందు నుంచి ఉన్న అంచనాలు, ధనుష్‌కు టాలీవుడ్‌లో ఏర్పడిన క్రేజ్ కారణంగా ఈ విజయాన్ని సాధించినట్టు సినీ విశ్లేషకులు చెబుతున్నారు. 'కుబేర' సినిమా ఒక ధనవంతుడు, ఒక పేదవాడు మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో రూపొందింది. ఇందులో ధనుష్ నటించిన దేవా పాత్రకి విశేషంగా స్పందన లభించింది. నాగార్జున నటించిన దీపక్ పాత్ర కూడా ఇంటెన్స్ గా ఉండటంతో ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకుంది. రష్మిక పాత్రకు మంచి సీట్ టైం ఉండగా, కథానాయికగా ఆమె కథను మలుపు తిప్పే పాత్రలో కనిపించగా సినిమా ఎమోషన్‌కి బలాన్నిచ్చింది. సుమారు 3 గంటల నిడివితో తెరకెక్కిన ఈ చిత్రం టెక్నికల్‌గా కూడా ప్రశంసలు అందుకుంది. నేపథ్య సంగీతం, విజువల్స్, ప్రొడక్షన్ వాల్యూస్ అన్ని కూడా హైలైట్‌గా నిలిచాయి. ముఖ్యంగా ధనుష్ నటనలో భిక్షగాడి యాంగిల్‌కి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ హైఎమోషనల్ కమర్షియల్ డ్రామా, టికెట్ల రేట్లు పెరిగినా కూడా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను బాగా ఆకర్షించింది. ఇక ఇటీవల కాలంలో ధనుష్ నటించిన నాలుగు సినిమాలు వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడం విశేషం. తిరు సార్ రాయన్ కుబేర ఈ విజయాలతో ధనుష్ తెలుగులో తన స్థాయిని పెంచుకుంటూ పోతున్నారు. ఇక 'కుబేర' వంటి హిట్‌తో ఆయనకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు రావడం ఖాయం అని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక నెక్స్ట్ ఎలాంటి విజయాలు అందుతాయో చూడాలి

# హాలీవుడ్ లోకి వరలక్ష్మి శరత్ కుమార్..



## ఏ మూవీ చేస్తుందంటే?

నటి వరలక్ష్మి శరత్ కుమార్ గురించి అందరికీ తెలిసిందే. కోలీవుడ్ యాక్టర్ శరత్ కుమార్ వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన అమ్మడు.. తనకంటూ స్పెషల్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. వేరే లెవెల్ లో తన సినిమాలతో మెప్పిస్తోంది. టాలీవుడ్ లో కూడా ఆడియన్స్ కు దగ్గరైంది. అన్ని భాషల్లో మంచి ఛాన్సులు ఆమె సొంతమవుతున్నాయి. టాలీవుడ్, మాలీవుడ్, కోలీవుడ్ లో సినిమాలు చేస్తూ దూసుకుపోతుందనే చెప్పాలి. ఇప్పుడు హాలీవుడ్ లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది వరలక్ష్మి. వెటరన్ డైరెక్టర్ చంద్ర రత్నం దర్శకత్వం వహిస్తున్న RIZANA-A Caged Bird మూవీతో హాలీవుడ్ లో ఆమె సందడి చేయనుంది. బ్రిటిష్ నటుడు జెరెమీ ఐరన్స్ సరసన కనిపించనుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా మూవీ తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మూవీ షూటింగ్ స్టార్ట్ అవ్వగా.. శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం శ్రీలంకలో షూట్ చేస్తున్నారు మేకర్స్. త్వరలో మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నారు. అయితే వరలక్ష్మికి ఇప్పుడు సోషల్ మీడియాలో నెటిజన్లు, సినీ ప్రియులు, పలువురు సెలబ్రిటీలు బెస్ట్ విషెస్ చెబుతున్నారు. ఇక వరలక్ష్మి కెరీర్ విషయానికొస్తే.. మొదట హీరోయిన్ గా అరంగేట్రం చేసిన ఆమె.. ఆ తర్వాత లేడీ విలన్ గా మారిపోయింది. పోదా పొడి మూవీ ఆమె సినీ జర్నీ స్టార్ట్ అయింది. ఆ తర్వాత పలు సినిమాల్లో ఫీమేల్ లీడ్ రోల్స్ లో నటించిన వరలక్ష్మి.. లేడీ విలన్ గా ఛేంజ్ అయిన విషయం తెలిసిందే. తన నటనతో ఆకట్టుకుంటోంది. ఇప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేస్తూనే, మరోవైపు నటిగా లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్టుల్లో యాక్ట్ చేస్తోంది. గత ఏడాది హనుమాన్, రాయన్, మ్యాక్స్ వంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించింది అమ్మడు. 2025లో స్టార్టింగ్ లో ఎప్పుడో కెరీర్ ప్రారంభంలో నటించిన మద గజ రాజా మూవీతో హిట్ సొంతమైంది. ప్రస్తుతం విజయ్ దళపతి జన నాయగన్ మూవీలో ఓ కీలక పాత్ర పోషిస్తున్న వరలక్ష్మి.. శివంగిలో కూడా నటిస్తోంది. మరిన్ని క్రేజీ ప్రాజెక్టుల్లో కూడా ఆమె భాగమైంది. సినిమాలతో పాటు పలు టీవీ షోలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోంది. ఇప్పుడు హాలీవుడ్ లో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. మరి హాలీవుడ్ డెబ్యూతో ఎలాంటి హిట్ వరలక్ష్మికి దక్కుతుందో వేచి చూడాలి.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh,epaper. www.prabhatha suryaa.com. Email. Prabhata surya @gmail.com.Rni TGTEL/25/A0784.